# విద్యార్థి జ్వాల

Vol. 28 - No.4
February 2022
Rs. 12/- per copy



## నిజ శిష్యత్వం

# క్రీస్తులో నిలిచి ఉందాం

శిష్యత్వాన్ని గూర్చి రాస్తూ స్కాట్‌లాండ్ దేశానికి చెందిన వేదాంతి విలియం బార్క్లేగారు ఈ సంఘటనను చెబుతాడు. ఒకసారి ఒక యువకుని గూర్చి ఒక వ్యక్తి, గురువుగారితో మాట్లాడుతూ "అతను మీ శిష్యుల్లో ఒకడని నాకు తెలుసు" అని అన్నాడట. ఈ మాట గురువుగారికి ఎంతో కోపం తెప్పించి "అతను నా శిష్యుడు కాదు, అతను నా ఉపన్యాసాలకు హాజరవుతాడు, అప్పుడప్పుడు నన్ను కలవడానికి వస్తాడేగానీ అతను నా శిష్యులలో ఒకడు ఎంతమాత్రం కాదు. **నా శిష్యులు నాతో ఉంటారు, నన్ను వెంబడిస్తారు, నేర్చుకుంటారు, నేను చెప్పినదాన్ని ఆచరిస్తారు** అని" చాలా గట్టిగా చెప్పాడట.

మన గురువు యేసుక్రీస్తు ప్రభువు (మత్తయి 23:10). క్యాంప్స్‌కు, చర్చ్‌కు హాజరైన ప్రతి ఒక్కరూ, ఆయన సందేశాలు విన్నవారందరూ ఆయన శిష్యులుకాదు. శిష్యుడు అంటే విద్యార్థి, నేర్చుకొనేవాడు. గురువు దగ్గర సమయాన్ని గడుపుతూ అనేక విషయాల్ని నేర్చుకునేవాడు. ఆయనను వెంబడించేవాడు, గురువు మాటలకు విధేయత చూపిస్తూ ఆయన అడుగుజాడల్లో నడిచేవాడు.

యోహాను సువార్త 15వ అధ్యాయంలో ఒక శిష్యుడు తనతో కలిగి ఉండాల్సిన సంబంధాన్ని 'ద్రాక్షావల్లి, తీగెలు' కలిగి ఉండే సంబంధంతో పోల్చి యేసుక్రీస్తు ప్రభువు వివరించాడు. నిజమైన ద్రాక్షావల్లి యేసుక్రీస్తు ప్రభువని, తీగెలు శిష్యులని, తండ్రి వ్యవసాయకుడని చెబుతూ, తీగెలు ద్రాక్షావల్లిలో నిలిచి ఉండాలని చెప్పాడు. తీగెలు ద్రాక్షావల్లిలో నిలిచి ఉండడం వల్ల తీగెలకు జీవం, బలం, సత్తువ, సౌందర్యం, సారం లభిస్తాయి. తీగె ద్రాక్షావల్లి నుండి వేరైతే దానికి స్వంతంగా జీవం ఉండదు. ద్రాక్షావల్లి నుండి ప్రవహించే సారం దాని ఆకులు, మొగ్గలు, పువ్వు, ఫలానికి మూలం అవుతుంది. ద్రాక్షావల్లిలో ఉన్నసారమంతా తీగెల ప్రయోజనం కోసమే. తీగె ద్రాక్షావల్లిలో నిలిచి ఉండడం వల్ల అది ఫలిస్తుంది, బహుగా ఫలిస్తుంది.

నిలిచి ఉండడం అంటే సాధారణ అర్థం ఒకచోట నిలిచి ఉండడం. శిష్యులు నిలిచి ఉండాల్సిన ఒకేచోటు క్రీస్తులో. ఆయన శరీరంలో అవయవాల్లాగా, ఆయన ఆలయంలో రాళ్ళలా, ఆయన కుటుంబంలో సభ్యుల్లా, ద్రాక్షా చెట్టయిన ఆయనలో తీగెల్లా నిలిచి ఉండాలి. క్రీస్తులో నిలిచి ఉండడమనేది విశ్వాసులు ఇష్టంతోనూ, ప్రేమతోనూ జరిగేది. బలవంతంగా, యాంత్రికంగా జరిగేదికాదు. తీగెలు ద్రాక్షావల్లిలో ఎలా అంటుకట్టబడి ఉంటాయో అలాగే, క్రీస్తు, శిష్యుల మధ్య ఉన్న ఐక్యత, సహవాసం అంత అన్యోన్యంగా ఉండాలి.

క్రైస్తవ జీవితంలో క్రీస్తులో నిలిచి ఉండడం మొదట క్రీస్తుతో సంబంధం కలిగి ఉండడం ద్వారా ప్రారంభమవుతుంది. దీనినే రక్షణ పొందడం అని కూడా అంటాము. క్రీస్తుతో సంబంధం ఏర్పడిన తర్వాత ఆ విశ్వాసి, దినదినం క్రీస్తు ఆజ్ఞల్ని గైకొంటూ ఆయనతో అన్యోన్య సహవాసాన్ని కోరుకొంటూ దానికోసం ప్రయత్నించాలి. అన్నిటికంటే, అందరి కంటే క్రీస్తుతో సహవాసానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రార్థన, వాక్యధ్యానాల ద్వారా అధిక సమయాన్ని ఆయనతో గడపడం అలవాటు చేసుకోవాలి. అలా ఆయనలో నిలిచి ఉంటున్నప్పుడు క్రీస్తు కూడా మనయందు నిలిచి ఉంటాడు. మనం ఫలిస్తాము. అంటే క్రీస్తు స్వారూప్యత దినదినం మనలో ఏర్పడుతుంది. శరీరసంబంధమైన కార్యాలను విసర్జిస్తాము, దేవుని సంబంధమైన విషయాలను హత్తుకుంటాము. మన మనస్సు రూపాంతరం చెందుతూ, మన ప్రవర్తన, తోటి వ్యక్తులతో సంబంధాలు, అలవాట్లు, పని విధానం మొదలైనవాటన్నిటిలో మార్పు వస్తుంది. ఆత్మఫలం (గలతీ 5:22) మన జీవితంలో కనిపిస్తుంది. అప్పుడు తండ్రికి మహిమ వస్తుంది, మనం ఆయన శిష్యులమని అందరూ గుర్తిస్తారు.

క్రీస్తులో నిలిచి, ఫలించాలన్నది ఆయన మనకు ఇస్తున్న పిలుపు. ఈ పిలుపును రక్షణపొందిన ప్రతి విద్యార్థిఅత్యున్నతమైనదిగా భావించాలి. చాలామంది విద్యార్థులు రక్షణ పొందినా ఆయన సహవాసంలో నిలిచి ఉండలేకపోవడానికి లోక ఆకర్షణలు, ఆశలు, మొబైల్ మొదలైనవి కారణాలుగా ఉంటున్నాయి. అందుకనే దేవునిలో ఎదగలేక ఆయనకు దూరమవుతూ, లోకానికి దగ్గరవుతున్నారు. ఆయనకు వేరుగా ఉండి మనమేమీ చేయలేమనే సత్యాన్ని గ్రహించాలి. ఎవరైతే యేసుక్రీస్తులో నిలిచి ఉంటారో వారు క్రీస్తు కొరకు సాక్షులుగా నిలుస్తూ దేవుని సేవ/పని చేయడానికి అర్హులుగా ఉంటారు. ఈ పాపలోకంలో ఆయన ఉద్దేశాలను నెరవేరుస్తూ ఆయనకు మహిమను తీసుకొస్తారు. అప్పుడు ఈలోకం అలాంటి వారిని నిజమైన క్రీస్తు శిష్యులుగా గుర్తిస్తుంది. మనల్ని క్రీస్తు శిష్యులని లోకం గుర్తిస్తుందా? లేక మనకు మనమే భావిస్తున్నామా?

**– పి. సునీల్ జాకబ్**

# విద్యార్థి జ్వాల



Vol. 28, No.4 February 2022
A Publication of
UESI Publication Trust

EDITORIAL BOARD:
Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Dr. J. Subbarao - Sec., Litt.Dept.

CONTACT:
The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

GIFTS & SUBSCRIPTIONS:
Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
ANNUAL: GRADUATES - Rs.250
STUDENTS - Rs. 120
LIFE INLAND - Rs. 2000
LIFE OVERSEAS - US $ 150

VIDYARTHI JWALA ACCOUNT NO:
**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:
**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:
**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPIC:
March : Turning Point
April : Goodness of Good Friday
May : Leadership
June : Problems of believing students
July : Imitating Christ
August : Patriotism

**Note:** Please send your writeups on or before
**10th of every month**



## క్రీస్తులో నిలిచి ఉందాం..

"నాలో నిలిచి ఉండకపోతే నీవేమీ చేయలేవు" (యోహాను 15:4-6). ఈ మాట యొక్క లోతైన భావం, దానిలోని సత్యం బలమైన ఆత్మీయతకు మూలం. నాకు నేనుగా దైవికమైన జీవం ఇవ్వగలనా? లేదు. కొనసాగించటం గానీ, దానిని పెంచడం గానీ సాధ్యమౌతుందా? సాధ్యమవ్వదు. ప్రతి కదలిక క్రీస్తు వలన పరిశుద్ధాత్మ ద్వారా జరిగే కార్యం. ఇది నమ్మితే విశ్వాసి సంపూర్ణంగా దేవునిపై ఆధారపడతాడు. ఇదే విశ్వాస జీవితం యొక్క సారాంశం. నీవు ఏమీ చేయలేవు అనే మాటకు హృదయపూర్వకంగా ఆమేన్ అంటాడు. అటు తర్వాత నన్ను బలపరచువానియందే సమస్తము చేయగలనని చెప్తాడు.

– ఆంఢ్రూ ముర్రే

## లోపలి పేజీల్లో...

❄ క్రీస్తులో నిలిచి ఉందాం - 2
❄ నిజ శిష్యత్వం - 4
❄ శిష్యరికం క్రమశిక్షణతో కూడినది - 9
❄ ఫలభరిత జీవితం - 13
❄ క్రాస్ వర్డ్ పజిల్ - 15
❄ ప్రేమకోసం - 16
❄ మాదిరి- 17
❄ నీ ఆసక్తి దేనిమీద? - 20
❄ మీ సమస్యలు, మా సలహాలు - 21
❄ పరిశుద్ధత అనుదిన జీవితంలో - 23
❄ సిలువ వేయబడిన హృదయాన్ని నాకివ్వు ప్రభూ - 27
❄ నిజ ప్రేమ - 28
❄ కోశాధికారి లేఖ - 31
❄ కొలబద్ద - 32

కవర్ కథనం

# నిజ శిష్యత్వం

## శిష్యుడంటే అర్థమేంటి?

మాన్‌ఫ్రెడ్ రోసలర్ 'యేసుతో నూతన జీవితం" అనే పుస్తకంలో యేసుక్రీస్తు శిష్యుడంటే ఎవరో చక్కగా నిర్వచించారు. 'యేసు శిష్యుడు యేసును వెంబడించడానికి, ఆయననుండి నేర్చుకోవడానికి తీర్మానం చేసుకొన్న వ్యక్తి, ఆయనతో ఎంతో సన్నిహిత సంబంధం కలిగినవాడు"

శిష్యుడు అనే మాట లాటిన్ పదమైన 'డిసిపులస్' అనే పదంనుండి వచ్చింది. దీనర్థం–విద్యార్థి మరియు నేర్చుకొనేవాడని అర్థం. గ్రీకు భాషలో 'మెథెటీస్' అనే పదంనుండి వచ్చింది. 'మెథెటీస్' అంటే నేర్చుకొనే విద్యార్థి అని అర్థం.

ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ నిర్వచనం ప్రకారం శిష్యుడు అంటే 'వేరే వ్యక్తిని తన బోధకునిగా, మాదిరిగా తీసుకొనేవాడే శిష్యుడు'.


అయితే శిష్యత్వం గురించి యేసు మాట్లాడినప్పుడు ఆయన డిక్షనరీ ఇచ్చిన నిర్వచనం కంటే ఎక్కువ భావాన్నిచ్చాడు.

మొదట యేసు 12 మంది శిష్యులను పిలిచినప్పుడు (మార్కు 3:14) 'వారు తనతో కూడా ఉండునట్లును, ... వారు తన నిమిత్తం సువార్త ప్రకటించడానికి పంపవలెనని వారిని ఏర్పరచుకున్నాడు".

'క్రైస్తవ శిష్యత్వమంటే బోధలను మాత్రమే పాటించడం కాదు గానీ మనల్ని ప్రేమించే స్నేహితునితో జీవితాంతం నడవడం' అని పీటర్ మేడెన్ అన్నాడు.

'ఆయన ఏమైయున్నాడో అలా ఉండడానికి ప్రయత్నించడమే శిష్యత్వం' అని జువాన్ కారోజ్ జెర్విజ్ అన్నాడు.

యేసయ్యను వెంబడించిన వారిలో అనేకులు రకరకాల కారణాలతో ఆయనను వెంబడించారు. కొందరు స్వస్థత కొరకు, కొందరు అధికారం కొరకు, కొందరు రొట్టెల కొరకు, కొందరు ఆయనను విమర్శించడానికి వెంబడించారు. అయితే కొంతమంది మాత్రమే ఆయనను యధార్థంగా వెంబడిచారు. యేసుక్రీస్తుకు గుంపులు, సమూహాలు అవసరం లేదు గాని నిజంగా ఆయనను వెంబడించేవారు కావాలి. ఆయనను వెంబడించాలంటే క్రింది విషయాలు గమనించుకోవాలి.





**"నేను ప్రార్థించకుండా చైనా దేశంలో ఇంతవరకూ సూర్యుడు ఉదయించలేదు"** - హడ్సన్ టేలర్

## 1. శిష్యత్వ షరతులు

యేసు ప్రభువు శిష్యునిగా ఉండాలంటే అదంత తేలికైన విషయం కాదు. కేవలం రక్షింపబడితే సరి పోదు. ఆయన శిష్యులుగా ఉండాలంటే 3 షరతులు న్నాయి.

### ఎ. హృదయంలో ప్రథమ స్థానం

తండ్రినైనను, తల్లినైనను నాకంటే ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాదు(మత్తయి 10:37), ఎవడైననూ నా యొద్దకు వచ్చి తన తండ్రిని, తల్లిని, భార్యను, పిల్లలను, అన్నదమ్ము లను, అక్కచెల్లెండ్రను, తన ప్రాణమును సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు (లూకా 14:25,26). అంటే అందరికంటే ఎక్కువగా ప్రభువును ప్రేమించాలి. ద్వేషించుట అంటే రెండవ స్థానం లేదా ప్రాధాన్యత అని అర్థం. విలియం మెక్ డొనాల్డ్ నిజ శిష్యత్వం అనే పుస్తకంలో "తమ జీవితాలలో ప్రథమ స్థానాన్నిచ్చే వారి కొరకు మన రక్షకుడు ఎదురు చూస్తున్నాడు" అని అంటాడు. ఏదో గ్రుడ్డిగా ఆయనను వెంబడించడం కాదు. అందరి కంటే ఎక్కువగా చివరికి నీ ప్రాణం కంటే ఎక్కువగా ఆయనను ప్రేమించాలి.

సి.టి స్టడ్ తనను వివాహం చేసుకోబోయే అమ్మాయి ప్రభువును ప్రేమించకుండా నిత్యమూ తన గురించే ఆలోచిస్తుందేమో అని ఒక పద్యం రాసి ఆమెకు పోస్ట్ చేశాడు. "దేవా నిన్ను ప్రేమిస్తున్నాను" ఈ వాక్యాన్ని రోజూ వల్లె వేయమన్నాడు. మనం మన ప్రథమ ప్రేమను ఆయనకిస్తేనే ఆయన శిష్యులుగా ఉండడానికి అర్హులం.

నీ తల్లికాని, తండ్రికాని, నిన్ను మారుమనస్సు పొందని ఒక వ్యక్తిని వివాహం చేసుకొమ్మని అడిగితే, ఆ సమయంలో నీవు దేవునినే ఎంపిక చేసుకొని ఆ వివాహం వద్దని సున్నితంగా చెప్పాలి.

నీవు ఎంతో ఇష్టపడే స్నేహితులు వారి పాపసంబంధమైన క్రియల్లో నిన్ను పాల్గొనమంటే నీవు వారికి 'కాదు' అని చెప్పి, వారితో రాజీపడకుండా దేవునికి ప్రథమ స్థానాన్ని ఇవ్వాలి.

### బి. తన్ను తాను ఉపేక్షించుకోవాలి

"ఎవడైనను నన్ను వెంబడింపకోరిన యెడల తన్ను తాను ఉపేక్షించుకొని.. వెంబడింపవలెను" (లూకా 9:23). ఉపేక్షించుకొనుట అనగా వాడుక భాష బైబిల్‌లో తన్ను తాను పరిత్యజించుకొని, ఈజీ టూ రీడ్ వర్షన్‌లో తన కోరికలను చంపుకొని, యన్ఐవిలో 'డినై హిమ్‌సెల్ఫ్' అనే అర్థాలు ఉన్నాయి. నేను అనే అహం వదలాలి. నీ హృదయసింహాసనం నుండి నేను అనే వానిని దించి అక్కడ ప్రభువును కూర్చోబెట్టాలి. నా ఇష్టం అనేది రాకూడదు. పౌలు ఇలా అన్నాడు 'జీవించువాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు' (గలతీ 2:20). స్వలాభం, గౌరవించబడాలనే కోరిక, సొంత ఇష్టము, సొంత దారి వదిలి వేయాలి, క్రీస్తుని రక్షకునిగా మాత్రమేగాక ఆయనను ప్రభువుగా అంగీకరించాలి. నీవు క్రీస్తుకు నిజ శిష్యునిగా ఉండాలంటే 'నేను అనే అహం, నేత్రాశనే పాపం నీలో తప్పక చావాలి' అని ఒక దైవజనుడు అంటాడు.

### సి. సమస్తము అర్పించుట

మీలో తనకు కలిగినదంతయు విడిచిపెట్టనివాడు నా శిష్యుడు కానేరడు (లూకా 14:33). మార్కు 10:21లో ధనవంతుడైన ఆ యౌవ్వనుడు ధనాన్ని వదలలేక దుఃఖపడుచూ వెళ్ళిపోయాడు. అబ్రహాము తాను ప్రేమించే ఇస్సాకును అర్పించాడు. దేవునికి మనల్ని మనం సజీవయాగంగా సమర్పించుకోవాలి. మన శరీర అవయవాలన్నింటినీ ఆయనకు అర్పించుకోవాలి. పాపాన్ని విడిచిపెట్టాలి. పాపాన్ని ఒప్పుకోవడం మాత్రమే సరిపోదు. ఒప్పుకొన్న పాపాన్ని పూర్తిగా విడిచిపెట్టాలి.

## 2. శిష్యత్వపు వెల

ఒక భక్తుడన్నాడు "రక్షణ ఉచితమే కాని శిష్యత్వం ఖరీదు". యేసు శిష్యునిగా ఉండాలంటే మనం కొంత వెల చెల్లించాలి. ఏమిటా వెల? సిలువ. లూకా 9:23 ఎవడైనను నన్ను వెంబడింప



గోరిన యెడల.... ప్రతీ దినము తన సిలువనెత్తుకొని నన్ను వెంబడించవలెను" సిలువను మోయాలి. సిలువను ధరించుట కాదు సిలువను భరించాలి. సిలువ అంటే శ్రమలు, అవమానాలు, అన్యాయానికి గురి కావడం, హేళనకు గురి కావడం. ఇవన్నీ శిష్యుని జీవితంలో సర్వ సాధారణం. ఎందుకంటే మనం ప్రవాహానికి ఎదురీదే బ్రతికిన చేపలం. దేవుని కొరకు నీతిగా యధార్థంగా జీవించాలంటే సిలువ భరించాల్సిందే. దేవుని దృష్టిలో సిలువలేని క్రైస్తవ్యం విలువలేని క్రైస్తవ్యం. అయితే ఇక్కడ మనమొక సత్యాన్ని గ్రహించాలి. మనం సహింపగలిగినంత కంటే ఎక్కువగా మన జీవితంలో శ్రమలను దేవుడు అనుమతించడు. ఈ సత్యాన్ని 1 కొరింథీ 10:13లో మనం చదవవచ్చు. అంతేకాదు సహించే మార్గాన్ని కూడా దేవుడు ఏర్పాటు చేస్తాడు. వాటిని సహించాలంటే మనం ఈ క్రింది విషయాలలో ఎడతెగకయుండాలి.

### ఎ. వాక్య ధ్యానం

"యౌవ్వనస్తులారా మీరు బలవంతులు దేవుని వాక్యం మీయందు నిలుచుచున్నది" (1 యోహాను 2:14). వాక్యధ్యానం ద్వారా దేవుని శక్తిని పొందుకోగలం. కనుక ప్రతీదినం మౌనధ్యాన సమయాన్ని చేసుకోవాలి. ఒక యౌవ్వనస్థుడు తన ఇంట్లో బైబిల్‌ను అనుమతించని పరిస్థితిలో బైబిల్‌లోని కొత్త నిబంధనను జిరాక్స్ కాపీ తీసుకొని క్వైట్‌టైమ్ చేసుకొనేవాడు. ఇప్పుడు మొబైల్లో బైబిల్ ఉంటుంది. గనుక తప్పక క్వైట్‌టైమ్ చేసుకోవాలి. వాక్యం హృదయంలో ఉంటే పాపంలో పడిపోయే అవకాశం ఉండదు (కీర్తన 119:9,11). కీర్తనాకారుడు వాక్యాన్ని ధ్యానించడానికి రాత్రిజాములు కాకముందే తన కళ్ళు తెరుచుకొంటాడు (కీర్తనలు 119:148). ఒక ప్లేయర్ స్లోగన్ 'బూస్ట్ ఈజ్ ద సీక్రెట్ ఆఫ్ మై ఎనర్జీ' అని అంటాడు. అలాగే ఒక క్రీస్తు శిష్యుని యొక్క స్లోగన్ ఇలా ఉండాలి 'బైబిల్ ఈజ్ ద సీక్రెట్ ఆఫ్ మై ఎనర్జీ'. వారానికి ఒకసారైనా వ్యక్తిగత బైబిల్ అధ్యయనం కలిగి ఉండాలి.

### బి. ప్రార్థన

సిలువను భరించడానికి దేవుడు ఏర్పాటు చేసిన రెండవ మార్గము ప్రార్థన. సిలువ మోయడానికి ముందు యేసయ్య రాత్రంతా గెత్సెమనే తోటలో ప్రార్థించాడు. ఒక సెల్ ఫోన్‌కి రీఛార్జ్ ఎంత అవసరమో మనకూ ప్రార్థనంతే అవసరం. ఏకాంత ప్రార్థనలో యేసు శక్తి పొందుకొంటేనే మన సిలు వను మనము భరించగలము. మార్కు 1:35లో గమనిస్తే యేసయ్య తన వాడుక చొప్పున పెందలకడనే లేచి అరణ్యానికి వెళ్ళి ప్రార్థించేవాడు. యేసయ్యకే ఏకాంత ప్రార్థన అవసరమైతే మనకు ఇంకెంత అవసరం? మత్తయి 26:41లో మనము శోధనలో ప్రవేశించకుండునట్లు మెలకువగా ఉండి ప్రార్థించమన్నాడు. హడ్సన్ టేలర్ అంటాడు "నేను ప్రార్థించకుండా చైనా దేశంలో ఇంతవరకూ సూర్యుడు ఉదయించలేదు" అంటే సూర్యోదయానికి ముందే లేచి ప్రతీ దినమూ ప్రార్థించేవాడు. కనుక సిలువను భరించాలంటే ఆయన వాక్యాన్ని అనుదినమూ ధ్యానిస్తూ, ఏకాంత ప్రార్థనలో ఆయన శక్తిని మనం పొందుకోవాలి. అలాంటి శిష్యులు ఆయనకు కావాలి.

## 3.శిష్యుని యొక్క ప్రవర్తన

జార్జివర్వర్ అనే దైవజనుడు 'రివల్యూషన్ ఆఫ్ ద లవ్ అండ్ బ్యాలెన్స్' అనే పుస్తకంలో నకిలీ శిష్యత్వం గూర్చి రాశాడు. అంటే అబద్ధశిష్యుడు. ఆ వ్యక్తి శిష్యుడు కాదు గాని నేను శిష్యుడనే అని భావిస్తాడు. ఈ పుస్తకంలో కొందరి పేర్లు ప్రస్తావించాడు. ఉదా. మిస్టర్. గాళ్ హంటర్, మిస్టర్. జడ్జ్ అదర్స్, మిస్టర్. నో ఇట్ ఆల్, మిస్టర్. టీచ్‌మి నాట్. ఈనాడు క్రైస్తవ్యం అంతా అబద్ధ శిష్యులతో నిండిపోయింది. ఒక నిజమైన శిష్యుడు ఎలా ఉండాలి? తన గురువులాగా అంటే యేసులాగా జీవించాలి. 1 పేతురు 1:14-16లో "మిమ్మును పిలిచినవాడు పరిశుద్ధుడైయున్న ప్రకారం మీరును సమస్త ప్రవర్తన యందు పరిశుద్ధులై యుండుడి. పరిశుద్ధ జీవితం ఈలోకంలో అసాధ్యం అంటారు చాలామంది. కానీ ప్రభువు సహాయంతో పరిశుద్ధ జీవితం సాధ్యమే.

## ఎ. మాటలలో పరిశుద్ధత

"కృతజ్ఞతా వచనమే ఉచ్చరింపవలెను గానీ, మీరు బూతులైనను, పోకిరి మాటలైనను, సరసోక్తులైనను ఉచ్చరింపకూడదు. ఇవి మీకు తగవు" (ఎఫెసీ 5:4). దుర్భాష ఏదైననూ మీ నోట రానీయకుడి (ఎఫెసీ 4:29). ఒక శిష్యుడు తన మాటల్లో పరిశుద్ధత కలిగి ఉండాలి. ఇంట్లో, కాలేజ్‌లో, హాస్టల్‌లో, ఆఫీస్‌లో, ఇరుగు పొరుగు వారి మధ్య సాక్షిగా ఉండాలి. ఇతరులను గాయపరిచే మాటలు మాట్లాడరాదు. మనం నోరు తెరిస్తే ఇతరులకు క్షేమం కలగాలి. నాలుక అదుపులో ఉంచుకోవాలి. వినుటకు వేగి రపడాలి. మాట్లాడడానికి నిదానించాలి.

## బి. క్రియలలో పరిశుద్ధత

మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోక మందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి (మత్తయి 5:16). ఆయన శిష్యులమైన మనం మన క్రియలలో కూడా పరిశుద్ధంగా జీవించాలి. మన క్రియలు సత్క్రియలైతే దేవునికి మహిమ, దుష్క్రియలైతే దేవునికి అవమానం. శిష్యుడు ఫోన్‌లో గంటలు గంటలు మాట్లాడడం, పరీక్షల్లో కాపీలు రాయటం, లంచాలు తీసుకోవటం మొ॥ చేయడు. యోసేపు వలె తన పవిత్రతను కాపాడుకొంటాడు. మన క్రియలు సరిగా ఉండాలంటే దేవుని సన్నిధి ఎల్లప్పుడు మనతో ఉందనే సత్యాన్ని గ్రహించాలి. అలా గ్రహించడమే పరిశుద్ధ జీవితానికి రహస్యం. యోసేపుకి ఈ గ్రహింపు ఉంది. పాపం నుండి పారిపోవాలి. శోధించే వ్యక్తుల నుండి శోధింపబడే స్థలాలనుండి పారిపోవాలి. నీ ఫోన్‌లో ఇంటర్నెట్ ఆన్‌చేసినప్పుడు దేవుని సన్నిధి నీతో ఉందని గ్రహించాలి.

## సి. చూపులలో పరిశుద్ధత

"ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసిన వాడగును (మత్తయి 5:28). "సీయోను కుమార్తెలు.. ఓర చూపులు చూచుచున్నారు" (యెషయా 3:16).

బైబిల్ గ్రంథంలో పురుషులు మోహపు చూపుతో, స్త్రీలు ఓర చూపుతో చూస్తే వ్యభిచారం చేసినట్లే అని చెబుతుంది. ఒక శిష్యుడు ఈ లోక సంబంధమైన ప్రేమలో పడకూడదు. ఎందుకనగా ఆ ప్రేమలో మోహపు చూపులు, ఓర చూపులు దాగి ఉన్నాయి. న్యూస్ పేపర్‌లో, టి.వి., ఇంటర్నెట్, సెల్ ఫోన్‌లో అసభ్య చిత్రాలు చూడడం దేవుని దృష్టిలో వ్యభిచారం. ఒక శిష్యుడు కీర్తనలు 119:37లోని ప్రార్థనను ప్రతి దినము చేసుకోవాలి. "వ్యర్థమైన దానిని చూడకుండా నా కన్నులను త్రిప్పివేయుము".


## డి. ఆలోచనలో పరిశుద్ధత

హృదయ శుద్ధి గలవారు ధన్యులు (మత్తయి 5:8). ఆలోచనలను గూర్చిన నాలుగు సత్యాలు.

మన హృదయాలోచనలు ప్రభువు చూస్తున్నాడు. "హృదయం యొక్క తలంపులలోని ఊహ అంతయు చూచి" (ఆది 6:5). మన ఆలోచనలు మనకి ప్రభువుకి తప్ప ఇంకెవ్వరికీ తెలియదు. కనుక మన ఆలోచనల ద్వారా మనం చేసే పాపానికి మనం దేవునికి లెక్క అప్పజెప్పాలి.

ఆలోచనలు క్రియలకు దారితీస్తాయి. ఆలోచన లేకుండా క్రియ ఉండదు. కాబట్టి మన క్రియలు పరి శుద్ధంగా ఉండాలంటే ముందుగా మన ఆలోచనలు పవిత్రంగా ఉండాలి.

మన ఆలోచనలపై అధికారాన్ని దేవుడు మనకే ఇచ్చాడు. "హృదయాలోచనలు మనుష్యుని వశము" (సామె 16:1) మన హృదయంలో వచ్చే ఆలోచనలకు కారణం సాతాను కాదు, ఆపోజిట్ సెక్స్ కాదు, మనమే. వాట్స్‌ఆన్ యువర్ మైండ్ అనే పుస్తకంలో రచయిత మెర్లిన్ "మనం ఏమి ఆలోచించాలని కోరుకొంటామో వాటినే ఆలోచిస్తాం" అని అంటాడు.





ఒక శిష్యునిగా మనముందున్న రెండవ సవాలు ఏంటంటే నశించిపోయే ఆత్మలను దేవుని కొరకు సంపాదించడమే. మన చుట్టూ పాపంలో ఉన్న వారిని, నరకానికిపోతున్న వారిని చూసి వారి కోసం భారంతో ప్రార్థించి వారికి సువార్త ప్రకటించాలి. వారిని రక్షణలోకి నడిపించాలి.

ఒక చెడు ఆలోచన మన మనసులోకి వస్తే దానిని వెంటనే తీసివేసుకోవాలి. దానిని కొనసాగిస్తే అది పాపంగా మారుతుంది.

మన ఆలోచనలకు కళ్ళు, చెవులనే రెండు ద్వారా లున్నాయి. ఏ ఆలోచనైనా, అది మంచిదైనా, చెడ్డదైనా కళ్ళతో చూడటం ద్వారా, చెవితో వినడం ద్వారా మన హృదయంలో ప్రవేశిస్తుంది. కనుక మన కళ్ళను, చెవులను జాగ్రత్తగా ఉంచుకోవాలి. ఏవి పవిత్రమైనవో... వాటి మీద ధ్యానముంచుడి (ఫిలిప్పీ 4:8).

### 4. శిష్యత్వపు సవాలు

యేసు శిష్యునిగా ఆయన దగ్గర నేర్చుకొన్నాక, మన ముందు రెండు సవాళ్ళున్నాయి. అవేవనగా..

#### ఎ. ఆయనకు సాక్షులైయుండాలి.

"...భూ దిగంతముల వరకు నాకు సాక్షులైయుండుడి" (అపొ.కా. 1:8) మనం ఆయన శిష్యులంగా దేవుని కొరకు మనం ఎక్కడ ఉంటే అక్కడ, ఎక్కడికి వెళితే అక్కడ దేవుని కొరకు సాక్షిగా జీవించాలి. సాక్షిగా జీవించాలంటే మనకు పరిశుద్ధాత్ముని శక్తి కావాలి. అపొ.కా. 2:42లో సాక్షిగా జీవించాలంటే నాలుగు సూత్రాలున్నాయి.

**అపోస్తలుల బోధ:** అనగా వాక్యాన్ని ప్రతి దినము ధ్యానించాలి. వాక్యాన్ని లోతుగా అధ్యయనం చేయాలి.

**సహవాసము:** దేవుని బిడ్డలతో నిత్యము సహవాసంలో ఉండాలి. ఒక శిష్యుడు ఎన్నడూ ఒంటరిగా ఉండరాదు. తోటి శిష్యులతో సహవాసం కలిగి ఉండాలి. క్రమంగా బైబిల్ స్టడీస్‌కి వెళ్ళడం, చర్చ్‌లో జరిగే కార్యక్రమాలకు హాజరవడం మనకెంతో క్షేమం. 'కొందరు మానుకొనుచున్నట్లు సమాజంగా కూడుట మానవద్దు (హెబ్రీ 10:24,25). సహవాసానికి దూరమైతే ఆత్మీయంగా ఆరిపోతాము. సహవాసమే విశ్వాసికి సగం బలం. ఒకరితో ఒకరం సహవాసం చేస్తూ దేవునితో కూడా సహవాసం చేస్తాం. సహవాసం ద్వారా ఒకరికొకరు ప్రోత్సహించబడతారు, సరిచేయబడతారు, ఒకరి నుంచి మరొకరు నేర్చుకుంటారు.

**రొట్టె విరుచుట:** ప్రతీ ఆదివారం సంఘంలో ప్రభురాత్రి భోజనంలో పాలుపొందాలి. అంటే అనుదినము మనం శుద్ధి చేసుకోవాలి.

**ప్రార్థన:** ప్రార్థించే క్రైస్తవుడు ఎదిగే క్రైస్తవునిగా ఉంటాడు. ఆయనకు వేరుగా ఉండి మనం ఫలించలేము కాబట్టి ప్రార్థన ద్వారా దేవుని శక్తి పొందుకొని ఆయనకు సాక్షిగా జీవించాలి. బబులోను దేశంలో దానియేలు సాక్షిగా జీవించడానికి రహస్యం దానియేలు ప్రార్థన జీవితమే.

#### బి. సువార్త ప్రకటించాలి

సర్వలోకానికి వెళ్ళి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడి (మార్కు 16:15), సమస్త జనులను శిష్యులనుగా చేయండి (మత్తయి 28:19). ఒక శిష్యునిగా మనముందున్న రెండవ సవాలు ఏంటంటే నశించిపోయే ఆత్మలను దేవుని కొరకు సంపాదించడమే. మన చుట్టూ పాపంలో ఉన్న వారిని, నరకానికిపోతున్న వారిని చూసి వారి కోసం భారంతో ప్రార్థించి వారికి సువార్త ప్రకటించాలి. వారిని రక్షణలోకి నడిపించాలి.

ఒక శిష్యుడు బతికితే దేవుని కొరకు బతకాలి లేదంటే దేవుని కొరకు చావాలి. సమూయేలు దుర్మార్గులైన ఏలీ కుమారుల మధ్య పవిత్రంగా జీవించినట్లు దేవుని కొరకు మనం సాక్షులుగా ఈ అపవిత్రమైన, పాప లోకంలో జీవించాలి. అందుకే మనముందున్న సవాలు ఇదే. ఆయన దగ్గర నేర్చుకోవాలి, ఆయన కొరకు జీవించాలి, అవసరమైతే ఆయనకు కొరకు చనిపోవాలి.

**– పాస్టర్. డి. రాము,** మోపర్రు

# శిష్యరికం

## క్రమశిక్షణతో కూడినది

క్రమశిక్షణ లేని శిష్యత్వం, శిష్యరికమే కాదు. శిష్యుడు గురువు గారి అడుగుజాడలలో నడవాలి, ఆయన జీవిత విధానం, ప్రబోధం, అంతా ఉన్నది ఉన్నట్లు అనుకరించాలి. ఒక విశ్వాసి అనుకరించాల్సిన ప్రభువు జీవితక్రమము గొప్ప సవాలుతో కూడిన ఆత్మీయ క్రమశిక్షణ. యేసుప్రభువు జీవితములో క్రమశిక్షణ స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన పెందలకడనే లేచి ఒలీవల కొండకు వెళ్ళి ప్రార్థించడం, ఆయన ఉపవాస జీవితం, తండ్రితో ఏకాంతంగా గడపటానికి సమయాన్ని ఏర్పాటు చేసుకోవడం, ప్రభువు యొక్క నిరాడంబర జీవితం, తగ్గించుకోవడం, పరిచర్య, ఇతరులకు ఇచ్చే సిద్ధమనస్సు మనకు శిరోధార్య లక్షణములు. ఒక సంపూర్ణ మానవుడుగా ఆయన జీవితవిధానం మనకు మాదిరి. ఆ మాదిరిని అనుసరించటానికి తప్పక అభ్యాసం కావాలి.

వీటిని ఆత్మీయ అభ్యాసాలు అని ఎందుకు పిలిచారంటే వీటిని ఒక వ్యక్తి తన సాధారణ జీవితంలో కలిగివుండలేడు. తన ఆత్మీయ ఆరోగ్యము కొరకు, ఎదుగుదల కొరకు, పరిపక్వతవైపుకు పయనించడానికి వీటిని తనకు తానుగా విధించుకొనే అలవాట్లు. వీని ద్వారా అప్పటివరకు తాను అవలంభిస్తున్న జీవిత విధానాన్ని ఆలోచనా విధానాన్ని మార్చుకొని సాంప్రదాయాలనుండి, లౌకిక విషయాల నుండి పరలోక విషయాలపైకి తన జీవన విధానాన్ని మార్చుకొంటాడు. ఈ సాధనలో ఒక పనిని మాటిమాటికి చేయడం ఆత్మసంబంధమైన నిర్ణయాలతో కూడినదై ఉండాలి. తద్వారా దేవునితో ఎంతో సన్నిహిత సంబంధానికి ఇవి నడిపిస్తాయి. వీటిని మనం అనుకుని పూనుకొంటేనేగాని చేయలేము. కొన్ని కార్యాలు మన ఆత్మీయ ఆరోగ్యానికి అవసరమని తెలిసినప్పటికీ, అవి చేయడానికి మనస్సు ఉండదు. ఈ ఆత్మీయ అభ్యాసాలు, వీటిని చేయడానికి ఒక పద్ధతిని, క్రమాన్ని అందించి, మన ఆత్మీయ ఆరోగ్యాన్ని కాపాడుకొనేటట్లు చేస్తాయి. ఇవి మనలను దేవునిని మరింతగా ఎరగటానికి, మరింతగా ప్రేమించడానికి సహాయం చేస్తాయి. ఇవి కార్యాలు కానీ దృక్పథాలు కాదు. ఇవి అభ్యాసము చేయవలసినవి, గుణశీల మునిస్తాయి కానీ ఆత్మఫలము కాదు.

ఈ అభ్యాసాలను కొన్నిసార్లు తప్పుడు దృక్పథంతో పరిసయ్యులవలె చేసే ప్రమాదం ఉంది. వారు తమ్ముతాము భక్తిపరులుగా కనుబరచుకోవడానికి చేసేవారు. కానీ క్రీస్తుప్రభువు శిష్యుడు ఆయన స్వరూపం ఏర్పడటానికి చేసే సాధకమే ఈ ఆత్మీయ శిక్షణలు. ఇవి క్రీస్తువలె ఉండడానికి, క్రీస్తుతో కూడా ఉండడానికి సహాయపడే క్రియలు లేక అభ్యాసాలు. ఇవి గమ్యసాధనకు మార్గాలే గాని గమ్యం కాదు.

### ఆత్మీయ అభ్యాసాల ఆవశ్యకత

1. ప్రతి శిష్యుడు క్రమం తప్పకుండా, ఖచ్చితముగా చేపట్టవలసిన ఆత్మీయ సాధకాలుగా వీటిని గుర్తించాలి.

2. అన్ని స్థాయిల విశ్వాసులకు ఇవి ప్రయోజనకరం.



3. ఈ ఆత్మీయ సాధకాల యొక్క గమ్యం దేవునితో అన్యోన్య సహవాసమూ; తనను వెంబడించమని చెప్పిన ప్రభువు జీవితక్రమాన్ని అనుసరించటమే.
4. ఈ క్రమంలో శిష్యుడు తన గురువు క్రీస్తుప్రభువు స్వరము వినటం, ఆయనను వెంబడించడం నేర్చుకొంటాడు.
5. శిష్యుడు తన ప్రాధాన్యతలను సరిచేసికోవడానికి ఇవి సహాయపడతాయి.

### ఇవి రెండు రకాలు

1. అంతరంగ ఆత్మీయ అభ్యాసాలు
2. బహిరంగ ఆత్మీయ అభ్యాసాలు

### అంతరంగ ఆత్మీయ అభ్యాసాలు

**1. ప్రార్థన:** ఆయన ప్రార్థన చేయుటకు అరణ్యములోనికి వెళ్ళుచుండెను (లూకా 5:16). మేము ప్రార్థనయందును, వాక్య పరిచర్యయందును ఎడతెగకయుందుమని చెప్పిరి (అ.కా. 6:4).

ప్రార్థనా జీవితంలో అనేకమంది విశ్వాసులు ఓడిపోవటానికి కారణం, ప్రార్థన చేయడాన్ని ఒక ఆత్మీయ అభ్యాసంగా ఎంచకపోవడమే. దేవుని సన్నిధిని ప్రవేశించడానికి దేవుడే ఏర్పాటు చేసిన మార్గము ప్రార్థన. అక్కడే దేవునితో సహవాసము, ప్రార్థనలో శిష్యుని మనస్సు నిత్యత్వపు ఉనికిని తాకి పరలోక సంబంధమైన తలంపులతో నింపబడుతుంది. మన జీవితములో, మన సమాజములో, మన ప్రపంచంలో దేవుడు ఏమిచేస్తున్నాడో దేవునితో కలసి వీక్షించడానికి ప్రార్థన ఒక సాధనము.

**అభ్యాసము:**

అ) ప్రార్థన క్రమశిక్షణతో కూడిన క్రియాత్మక తీర్మానముతో శిష్యుని జీవనశైలిలో భాగమై పోవాలి.

ఆ) ఒక నిర్ణీత స్థలము, సమయం కేటాయించుకొని క్రమం తప్పకుండా అభ్యసించాలి. దేవుని కలుసుకోవడానికి ఆయన స్వరము వినడానికి జీవితాన్ని తదనుగుణంగా మార్పు చేసుకోవడానికి ప్రార్థన ఒక సాధనం.

ఇ) మోకరించి ప్రార్థన చేయుట అభ్యాసము వలన సులభమవుతుంది.

**2. ఉపవాసము:** మీరు ఉపవాసము చేయునప్పుడు వేషధారులవలె దుఃఖముఖులైయుండకుడి.... ఉపవాసము చేయుచున్నట్లు మనుష్యులకు కనబడవలెననిగాక రహస్యమందున్న నీ తండ్రికే కనబడవలెనని.... మత్తయి 6:16,17.

శిష్యుడు తన సౌఖ్యవంతమైన పరిస్థితిని ప్రక్కనబెట్టి దేవునితో కూడా ఆత్మసంబంధమైన వాతావరణంలోనికి ప్రవేశించి నివసించుటే ఉపవాసము. ఉపవాసము ద్వారా, శిష్యుడు తన స్వచ్ఛంద నిర్ణయం ద్వారా భౌతిక కోరికలను కాదనుకొని, ఆత్మసంబంధమైన శక్తిని, సున్నితత్వమును పెంపొందించుకొనగలడు. ఉపవాసం ద్వారా తన భౌతిక శరీరంపై ఆకలికి గల పట్టును సడలింపచేసి ఆత్మసంబంధమైన జీవితము యొక్క దృక్పథానికి ఉపవాసము పదును పెడుతుంది. దైవగ్రంథములో ఉపవాసము చేసినవారు, అతిశ్రేష్ఠమైన ఆత్మీయ లాభాన్ని పొందటానికి తమ శరీరాలకు విలువైన భౌతిక ఆహారాన్ని కాదనుకొని తమ్మును దేవునికి అప్పగించుకొన్నారు. ఉపవాసము ద్వారా లోకములో ప్రామాణికంగా ఎంచబడే క్రమము నుండి దేహాన్ని తప్పించి ఆత్మసంబంధమైన కార్యాలకు దానిని లోబరచటం జరుగుతుంది.

**అభ్యాసము:**

అ) వారానికి ఒకరోజు కేటాయించుకొని ఉపవాసము చేయటం మంచిది.

ఆ) ఆ రోజు ఒక పూట ఆహారము తీసుకోకుండా ఉండవచ్చు లేదా ఒక విధమైన ఆహార పదార్థములను కొన్ని నెలల వరకు బహిష్కరించి పాటించవచ్చు.

ఇ) ఉపవాసములో ప్రధాన ఘట్టము దేవునితో గడిపే సమయం. వాక్యము, ప్రార్థన, మౌనము, మొదలగు విషయాల ద్వారా దేవుని సన్నిధిని అనుభవించగలం.

**3. పఠనము:** దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించు వానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్తపడుము (2 తిమోతి 2:15).

సత్యాన్వేషణ శిష్యుని గురుతర బాధ్యత. దైవవాక్య పఠనము శిష్యుని జీవితంలో అతిప్రాముఖ్యమైన భాగము. ఒక వ్యక్తిని మనము ప్రేమించినప్పుడు ఆ వ్యక్తిని గూర్చిన సమాచారం సాధ్యమైనంత

సంపాదిస్తాము. దేవుని గూర్చిన సత్యము మనలను దేవునితో ప్రేమలో పడడానికి నడిపిస్తుంది. వివిధ పఠన విధానాల ద్వారా దైవ వాక్యమునందలి భిన్న విషయ జ్ఞానాన్ని సంపాదిస్తాము. సాధారణ వాక్యపఠనములో విమోచన కార్య చరిత్రను గుర్తించగలము. పుస్తక పఠనములో, ఆ పుస్తకము దేవుని విమోచన కార్యక్రమములో ఏ స్థానాన్ని వహిస్తుందో గుర్తిస్తాము. మన హృదయంలో కొన్ని ప్రశ్నలకు విషయసూచక పఠనము (టాపికల్ స్టడీ) జవాబులను ఇస్తుంది. సత్యమును అర్థం చేసుకోవడం ద్వారా మనస్సు రూపాంతరం చెందుతుంది. అది శిష్యునిలో క్రీస్తుప్రభుని ప్రవర్తనను తీసుకొని రావడం మాత్రమేకాక తనను హేతువడుగు వానికి స్పష్టమైన జవాబు చెప్పడానికి వీలౌతుంది.

**అభ్యాసము:**

వారములో ఒకటి, రెండు రోజులు వాక్యపఠనానికి కేటాయించుకొని కనీసం 2 గం॥లు వాక్యముతో గడపడానికి సిద్ధపడాలి. సహాయకరముగా నోట్స్, కామెంటరీలు, నిఘంటువులు, సిద్ధము చేసుకోవాలి.

**4. ధ్యానము:** ఈ ధర్మశాస్త్ర గ్రంథమును నీవు బోధింపక తప్పిపోకూడదు. దానిలో రాయబడిన వాటన్నిటి ప్రకారము చేయుటకు నీవు జాగ్రత్తపడునట్లు దివారాత్రము దానిని ధ్యానించిన యెడల నీ మార్గము వర్ధిల్లచేసుకొని చక్కగా ప్రవర్తించెదవు (యెహో 1:8)

ధ్యానము ద్వారా లేఖనములోని సారం మనస్సుకు అందించడం జరుగుతుంది. ధ్యానమును నెమరువేయడంతో పోల్చవచ్చు. తద్వారా దైవవాక్య సత్యము ప్రార్థనాపూర్వకముగా ఆలోచించుట వలన ఆత్మ దేవుని సహాయము ద్వారా బోధింపబడుతుంది. ధ్యానములోనే దేవుని స్వరమును వినే భాగ్యము లభిస్తుంది. శిష్యుడు దేవుని గూర్చిన సత్యము తెలుసుకొనుట చాలదు. దేవునిని వ్యక్తిగతముగా ఎరగాలి.

**అభ్యాసము:**

1) ధ్యానము హడావిడిగా జరిగే కార్యం కాదు. అందుకే తగినంత సమయం కేటాయించుకోవాలి.

2) ధ్యానమనేది నిశ్శబ్దంగా ఉండే ప్రాంతాన్ని ఎంచుకొని ఉదయంగానీ, రాత్రి సమయంలో చేయడం మంచిది.



3) ధ్యాన సమయంలో ఒక్కొక్కసారి కొన్ని వచనాలను మాత్రమే ధ్యానించాలి.

4) ఒక్కొక్క మాట, తిరిగి తిరిగి చదివి, ఆలోచిస్తూ, ప్రార్థిస్తూ, ఆత్మ దేవుని సహాయంతో వాటిలోని సారాన్ని గ్రహించటానికి తీర్మానించుకోవాలి.

## బాహ్యపరమైన ఆత్మీయ అభ్యాసాలు

**1. నిరాడంబర జీవితం:** నేనేస్థితిలో ఉన్నను ఆ స్థితిలో సంతృప్తి కలిగియుండ నేర్చుకొని యున్నాను (ఫిలిప్పీ 4:11).

నిరాడంబర జీవితం అంటే లోకసంబంధమైన విలువల నుండి విడుదల పొంది నిజమైన ఆనందం, తృప్తి అనుభవించుట. తమ అక్కరలకు, విలాసాలకు మధ్యగల భేదాన్ని గుర్తించగలిగినవారే నిరాడంబర జీవితం జీవించగలరు. నిరాడంబర జీవితం నేత్రాశ నుండి, నోటి ఆశలనుండి, హృదయాశలనుండి కాపాడుతుంది.

**అభ్యాసము:**

1) తక్కువ దానితో తృప్తి చెంది అక్కరలేని దానిని ఇచ్చివేయాలి.

2) జీవితంలోని నిజమైన అక్కరల విషయంలో పునఃపరిశీలన చేసుకోవాలి.

3) ఆహారము, బట్టలు మంచివేకాని వాటిపై వేలాది రూపాయలు ఖర్చు చేయనవసరం లేదు.

4) నిరాడంబర జీవితం అంటే లేమిలో జీవించడం కాదు గానీ ఉన్న దానితో తృప్తిగా ఉండటం.

క్రీస్తుప్రభువు వారి జీవితం నిరాడంబర జీవితానికి ఒక అద్భుత సాక్ష్యం.

నిరాడంబరత మానసిక దృక్పథం. ప్రభువు తన సత్యంతో మనస్సును సంధిస్తేనే గానీ శిష్యుడు నిరాడంబర జీవితాన్ని అభ్యాసం చేయలేడు.

**2. ఏకాంత మౌనము:** మన ప్రాణానికి కొంత విశ్రాంతి అవసరం. ఏకాంత మౌనమనే ఈ అభ్యాసంలో దేవునితో కొంత సమయం మౌనంగా ఏమీ మాట్లాడకుండా గడిపి, జీవితాన్ని గూర్చిన పునర్విశ్లేషణ చేసుకోవడం జరుగుతుంది. ఈ

ఏకాంత మౌనంలో జీవిత ప్రాధాన్యతలు, విలువలను గూర్చిన పునర్విమర్శ, విశ్లేషణ జరపడం ప్రాముఖ్యం. సరైన అమరికతో తిరిగి లోకములోనికి వెళ్ళాలి. ఈ మౌనంలో దేవుని స్వరాన్ని వినడానికి సన్నద్ధులైవుండాలి.

**అభ్యాసము:**

1) ఇది జనసంచారం ఉండే స్థలాలలో చేసే అభ్యాసం కాదు.
2) మనస్సును నిమ్మళపరచుకోవడం ద్వారా బయట నుండి లోపల నుండి వచ్చే అనేక స్వరాల గందరగోళం నుండి వేరై దేవుని మెల్లని స్వరాన్ని వినడానికి మనస్సు నిలుపుకోవాలి.
3) నెలలో ఒక గంట ఇలాంటి సమయాన్ని అభ్యాసం చేసి జీవితాన్ని సరైన విధానంలో దేవునితో, ఆయన విలువలతో, ప్రాధాన్యతలతో అనుసంధానం పరచుకోవడమే దీని లక్ష్యం.

**3. లోబడడం:** (ఒకనికొకడు ప్రభువులో లోబడివుండుడి. ఎఫెసీ 5:21).

లోబడుట అనే ఈ ఆత్మీయ క్రమశిక్షణ, స్వచ్ఛందంగా ఒక విశ్వాసి ఒక అధికారానికి తనను తాను అప్పగించుకోవడానికి అంగీకరించడం.

లోబడటంలో అవతలి వ్యక్తి యొక్క అక్కరలు నా అక్కరలకంటె ప్రధానమైనవిగా ఎంచుకోవడం జరుగుతుంది. ఇది అభ్యాసం ద్వారా మాత్రమే సాధ్యం. లోబడడానికి ఆత్మీయ క్రమశిక్షణగా ఎంచడానికి కారణం, అది లోకములో సామాన్యంగా ఉండే ప్రవర్తనకు వ్యతిరేకం. శిష్యుడు లోబడే జీవితానికి తనను తాను అప్పగించుకొనబద్ధుడు. లోబడడం నిర్వీర్యమైన పనికాదు లేక బలహీనత కాదు. అది ఒక నమ్మకంతో కూడిన క్రియ. లోబడటం వలన మానవ సంబంధాలు పోషింపబడతాయి. తద్వారా ఒకరిపై ఒకరు ప్రేమతో, నమ్మకంతో ఒకరికొరకు మరొకరు తగ్గించుకొంటారు.

**అభ్యాసము:**

1) దేవుడు నాపైన ఎవరిని అధికారిగా ఉంచాడో ఆ వ్యక్తిని క్రమంగా కలుసుకొంటూ నా జీవితంపై వారి అధికారాన్ని అంగీకరించి, గౌరవించాలి.
2) లోబడడం వలన హక్కులను పోగొట్టుకున్నట్లు భావించక దేవుని ఆజ్ఞను నెరవేరుస్తున్నట్లు తలంచాలి.
3) అధికారి, పరిచారకుడు బాధ్యతలలో వేరు కానీ అంతస్తులో సమానమని ఎంచుకోవాలి.

**4. పరిచర్య:** 1 పేతురు 4:10: దేవుని నానావిధమైన కృపల విషయమై మంచి గృహనిర్వాహకులై యుండి, ఒక్కొక్కడు కృపావరము పొందిన కొలది ఒకనికొకడు ఉపచారము చేయుడి.

శిష్యుడు దయగలవానిగా, కనికరముగల వాడుగా, మర్యాదస్థునిగా ఉండాలి. మనచుట్టూ ఉండే వ్యక్తులకు స్వచ్ఛందంగా పరిచర్య చేయడం మన కర్తవ్యం. గురువునైన నేను మీ పాదములను కడిగిన యెడల మీరును ఒకరి పాదములను ఒకరు కడుగవలసినదే అనిన మన ప్రభువు మాదిరి మనకు శిరోధార్యం.

**అభ్యాసము:**

1) ఇతరులకు సహాయం చెయ్యడం
2) ఇతరుల అవసరాలు సాధ్యమైనంతగా తీర్చడం మన బాధ్యత
3) బాధలలో, కష్టాల్లో, రోగగ్రస్తులుగా ఉన్న వారిని దర్శించుట.

**5. ఇవ్వడం:** మత్తయి 6:19-20: భూమి మీద మీ కొరకు ధనమును కూర్చుకొనవద్దు. ఇక్కడ చిమ్మెటయు తుప్పును తినివేయును. దొంగలు కన్నము వేసి దొంగిలెదరు. పరలోకమందు మీ కొరకు ధనము కూర్చుకొనుడి.

ఇవ్వడమనేది మన సహజ లక్షణం కాదు. శిష్యుడు ఈ లక్షణాన్ని అభ్యసించాలి. మన ప్రభువు తన ప్రాణమును సహా ఇచ్చి గొప్ప మాదిరి మనముందు ఉంచాడు. ఇతరుల అవసరాలకు ఇవ్వడం, ధనము, సమయం, తలాంతులు ఖర్చుపెట్టడానికి వెనుకాడక పోవడం శిష్యుని లక్షణం.

**అభ్యాసము:**

1) క్రమం తప్పకుండా దేవుని కార్యాలకు ఇవ్వడానికి ఆదా చెయ్యాలి.
2) త్యాగపూరితంగా ఇవ్వడం అభ్యసించాలి.
3) ఆలోచనాపూర్వకంగా, ఒక ఉద్దేశంతో, గమ్యంతో ఇవ్వడం అభ్యసించాలి.

**– కె. దేవిడ్ రాజ్ కుమార్,** గుంటూరు





# ఫలభరిత జీవితం

ఫలభరితమైన చెట్టు అనేకుల దృష్టిని ఆకర్షిస్తుంది. యజమానుని మనస్సును సంతోషపరుస్తుంది. చెట్టు యొక్క ఫలసాధనకు, పచ్చదనానికి కారణం ప్రాముఖ్యంగా దాని వేరు మండలం. ఫలితం ఇవ్వని వృక్షాలు మరియు మొక్కలు యజమానికి మనస్తాపాన్ని, దు:ఖాన్ని కలుగజేస్తాయి. ఆత్మీయ జీవితంలో దేవుడు ఒక విశ్వాసి యొద్ద నుండి ఎదురుచూచే ఫలితం పొందకపోవడానికి కారణాలు ఏంటి? ఫలితంకోసం విశ్వాసి తీసుకొనవలసిన జాగ్రత్తలు ఏవి?

ఒక వ్యక్తి యేసుక్రీస్తు ప్రభువును తన రక్షకునిగా అంగీకరించినప్పుడు దేవుడు ఆ వ్యక్తి జీవితంలో జరిగించే అపూర్వ ప్రక్రియలు ఏంటంటే...

1. అతని పాపము అనగా భూత, వర్తమాన, భవిష్యత్కాల పాపములు సంపూర్తిగా కడిగి వేయబడి, క్షమించబడతాయి (హెబ్రీ 8:12).
2. క్రీస్తు ప్రభువువారి నీతి ఆ వ్యక్తిపై ఆపాదించ బడుతుంది (2 కొరింథీ 5:21).
3. పరిశుద్ధాత్మ దేవుడు వ్యక్తి దేహాన్ని తనకు ఆలయంగా చేసుకొంటాడు (1కొరింథీ 6:19). లోపలికి వచ్చిన పరిశుద్ధాత్మ దేవుడు మానవ ఆత్మను దేవునితో కలుపుతాడు. దీనినే నిత్యజీవము లేక ఆత్మలో జీవించడం అంటారు (1 కొరింథీ 6:17).
4. వ్యక్తి యొక్క మనస్సు పాపస్వభావం యొక్క చెరనుండి విడుదలపొంది, స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోవడానికి శక్తికలిగి ఉంటుంది (రోమా 8:2).
5. పరిశుద్ధాత్మ దేవుడు క్రీస్తు ప్రభువు లక్షణాలను ఉత్పత్తి చేయగల నూతన స్వభావంను సృష్టిస్తాడు (ఎఫెసీ 4:24; కొలస్సీ 3:10).

పైన చెప్పిన విషయాలు దేవుడే క్రీస్తు ప్రభువువారి మరణ, పునరుత్థానములను విశ్వసించు ప్రతివానిలో జరిగిస్తాడు. అనగా దేవుని నీతిని నెరవేర్చలేని పాపిని మారుమనస్సు అనే మానవాతీత కార్యం ద్వారా ఒక నూతన వ్యక్తిగా చేసి అతనిలో నుండి దైవలక్షణాలను ఉత్పత్తిచేయగల వానిగా చేస్తాడు. ఇది కేవలం దేవుని కృప వలన జరిగే కార్యమే గాని మానవ ప్రయత్నం వల్లజరిగేది కాదు.

***ఒక వ్యక్తి క్రీస్తు ప్రభువును రక్షకునిగా అంగీకరించుట ద్వారా తన జీవితంలోనుండి క్రీస్తు ప్రభుని లక్షణాలను ఉత్పత్తి చేసే క్రియను 'ఆత్మఫలంను' కలిగియుండుట అని అంటారు.*** ఇది ప్రతి విశ్వాసిలో దేవుడు ఎదురుచూసే మార్పు. రక్షణ పొందుటకు మానవుడు చెల్లించే క్రయము సున్నా. దేవుడే పూర్తి క్రయాన్ని చెల్లించాడు (ఎఫెసీ 2:8), కాని ఆత్మఫలం స్వచ్ఛందంగా కలుగదు. విశ్వాసి జీవితంలో దైవ స్వభావంను ఉత్పత్తిచేసే బీజం దేవుని ద్వారా సృష్టింపబడిననూ, దాని అభివృద్ధి, ఫల సాధన కేవలం విశ్వాసిపైనే ఆధారపడి వుంటుంది. అందుకే చాలామంది విశ్వాసులలో దైవలక్షణములకు బదులు పాపలక్షణములను మాత్రమే చూడగలు గుచున్నాము.

### ఆత్మఫలమునకు మూల కారణం

ఒక విశ్వాసి జీవితంలో ఆత్మఫలమును కలిగి

ఉండుటకు మూలం దేవునితో సహవాసము. విశ్వాసికి దేవునితో కలిగియున్న సంబంధము దేవుని నిబంధనపై ఆధారపడినది మరియు అది ఎన్నడూ తెగిపోనిది. అందుచేతనే దానిని నిత్యజీవం అని పిలిచారు. కాని దేవునితోగల సహవాసము కేవలము విశ్వాసి విధేయతపై ఆధారపడి ఉంటుంది. అనగా దేవునితో సహవాసానికి విశ్వాసి చెల్లించవలసిన క్రయం దేవుని మాటకు విధేయతచూపుట. సమ్మతింపకుండా ఇద్దరు కూడి నడతురా (ఆమోసు 3:3) అని ప్రవక్త పలికిన మాట సరియైనదే. విశ్వాసి దేవునితో సహవాసం చేయడానికి అనేక విషయాలలో దేవునితో సమ్మతి పడాలి.

దేవుడు పరిశుద్ధత విషయంలో రాజీపడడు. ఆయనలో చీకటి ఎంతమాత్రమును లేదు (1యోహాను1:5). ఆయన ముఖకాంతిలో నా రహస్య పాపములు కనబడుచున్నవని కీర్తనాకారుడు చెప్పిన మాట సత్యము. రహస్యపాపములు అనగా మనుష్యులకు కనబడకుండా చేసినవని అర్థం. మరియు నాకు కనబడకుండా రహస్యముగా ఉన్నాయని కూడా అర్థం. ఆయనతో సహవాసము చేయునప్పుడు దేవుని సత్యమనే నేపథ్యములో నేను ఇంతకు మునుపు పాపములుగా ఎంచుకొనని కార్యములు నాకు పాపములుగా కనబడతాయి. ఆయన వెలుగు లోనున్న ప్రకారము మనమును వెలుగులో నడచిన యెడల, దేవుడు-విశ్వాసి అన్యోన్య సహవాసం గలవారై ఉంటారని 1 యోహాను 1:7లో గమనించగలం. ఆ తర్వాత వాక్యములో, 'అప్పుడు' అనగా ఆయనతో అన్యోన్య సహవాసం చేస్తున్నప్పుడు ఆయన మన గమనంలోకి తీసుకువచ్చే అనేక తప్పిదములను మనము ఒప్పుకొంటూ, ఆయన రక్తములో కడుగబడుచు మరింత పరిశుద్ధతకు మార్చబడే అనుభవంను గుర్తించగలము. దీనిని యోహాను 15:2లో 'ఫలించు ప్రతితీగ' అనగా ఆయనతో సహవాసము చేయు ప్రతి విశ్వాసి మరింతగా ఫలించాలని ప్రభువు తన కత్తెరను వాడి పనికిరాని వాటిని మన దృష్టికి తీసుకొచ్చి వాటినుండి మనకు విడుదల దయచేస్తాడు.

అబ్రహాము తన జీవితంలో దేవునితో సహవాసం చేస్తూవుండగా, దేవుని సంకల్పమునకు ఆటంకముగా ఉన్న విషయాలను దేవుడు అబ్రహాము నుండి కత్తిరించినట్లుగా చూడగలం. మొదటిగా తండ్రి నాహోరు హారానులో మరణించాడు. ఆ తర్వాత లోతును దేవుడు వేరు చేశాడు. తన అవిశ్వాసం ద్వారా తన కుటుబంలోనికి వచ్చిన ఇష్మాయేలును కూడా దేవుడు అబ్రహామునుండి వేరుచేశాడు. అప్పుడు మాత్రమే అబ్రహాము జీవితంలో దేవుడు కోరుకొనిన ఫలితం, ఈ భూలోకమునకు విస్తరించి ఆశీర్వాదానికి మార్గముగా ఆయనను దేవుడు చేయగలిగాడు.

## దేవునితో సహవాసము జరిపే స్థలము

విశ్వాసి జీవితంలో ఫలభరిత జీవితము అనగా దేవుని లక్షణాలను బహిరంగపరచే జీవితం మాత్రమే మన చుట్టు ఉన్న సమాజమును ప్రభావితం చేస్తుంది. విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ దేవునితో సహవాసం చేయకుండా కేవలం మాటలకు మాత్రమే పరిమితం కావడం ఆత్మీయ జీవితానికి తీవ్ర పరిణామాలను కలిగిస్తాయి. దేవునితో సహవాసం పైకి కన్పించే చర్యకాదు. అది అంతరంగ, రహస్య, ఏకాంత జీవితానికి సంబంధించినది. ఫలము చెట్టు కనిపిస్తుంది కాని ఫలాన్ని కలిగించే వేరు మండలం భూమిక్రింద కనబడకుండా చాలా వైశాల్యంలో ప్రాకి ఉంటుంది. ఆత్మఫలం (గలతీ 5:22) కేవలం లక్షణం (Symptom) కాని దేవునితో సహవాసం మూల కారణం (Cause).

## దేవునితో గడిపే సహవాసంలో ఏమి జరుగుతుంది?

దేవునితో విశ్వాసి ఏకాంతములో చేయు సహవాస జీవితము ద్వారా విశ్వాసి యొక్క అంతరంగపురుషుడు లేక నూతన స్వభావము బలపరచబడుతుంది (ఎఫెసీ 3:15). విమోచింపబడిన మనస్సులోనికి దేవుని సత్యం వాక్య ప్రత్యక్షతద్వారా అందించబడుతుంది. దేవుని వాక్య ప్రత్యక్షత, దేవుని స్వరము వినుటద్వారా, మనస్సులో రూపాంతర క్రియ ప్రారంభమౌతుంది. దినదినం అతని విలువలలో, భావనలలో, దృక్పథంలో మార్పువస్తుంది. దృక్పథంలో మానవకోణం తగ్గి దైవదృక్పథం వస్తుంది. దేవుడు మనుష్యులను, సంగతులను ఏవిధంగా చూస్తాడో ఆ విధంగా చూడడం మొదలుపెడతాడు. మనస్సులోని మార్పు జీవిత విధానంలో విప్లవాత్మక మార్పును తెస్తుంది. ఫలము వ్యక్తమగుట ప్రారంభమౌతుంది. ఫలించు జీవితాన్ని మరియెక్కువగా ఫలింపచేయడానికి దేవుడు తన పని జరిగిస్తాడు.

### ఫలములేని విశ్వాస జీవితము

యోహాను సువార్త 15:5,6 లలో ఫలించని విశ్వాస జీవితము యొక్క పర్యవసానం వివరింపబడివుంది.

**ఎ) ఎండిపోయే జీవితం (6వ):** దేవుని జీవం, విశ్వాసికి దేవునితోవున్న సంబంధం నుండి వస్తుంది. కాని సమృద్ధి జీవం దేవునితోగల సహవాసంనుండి వస్తుంది. సమృద్ధిజీవంలేని విశ్వాసి ఆత్మీయంగా ఎండిన జీవితం కలిగిఉంటాడు. జీవించివున్నాడనే పేరు మాత్రమే కలిగివుంటాడు (ప్రక 3:1).

**బి) శక్తిలేని జీవితం (5వ):** ఆ జీవితంలో విశ్వాసి ఏమిచేయలేని పరిస్థితి గమనించగలం. వ్యక్తిగత జీవితంలో ఓటమి, పతనము, పరిచర్య జీవితంలో ఫలసాధనలేమి గమనించగలం.

**సి) పారవేయబడిన, ఉపయోగకరంకాని జీవితం (6):** మన ఉనికి మనచుట్టూ ఉన్న సమాజానికి, విద్యార్థి లోకానికి ఆశీర్వాదాన్ని పంచి ఇవ్వాలనే దేవుని సంకల్పం మనద్వారా నెరవేరదు. మననుండి ఆత్మీయ సహాయం, సలహాకోసం ఎదురుచూసే విద్యార్థిలోకానికి రిక్తహస్తాలను మాత్రమే చూపగలం. పనికిరాని పాత్రగా, అంటే యజమానుడు వాడుకోవడానికి అనర్హమైన పాత్రగా మిగిలిపోతాము (2 తిమో 2:21).

ప్రతి విశ్వాసి మీద దేవుని పెట్టుబడి దేవుని స్వార్థం కోసం కాదుకాని తద్వార విశ్వాసి తన జీతం (ప్రతిఫలం) పొందడానికే. మన ఫలానికి ప్రతిఫలమునిచ్చే న్యాయవంతుడైన దేవుని కలిగియున్నమనం ఎంతో ధన్యులం. ఆయనకోసం మనం ఫలించే జీవితానికి తప్పకుండా మనం కొంత క్రయం చెల్లించాలి. కొన్నిసార్లు మనకిష్టమైన వాటిని కాదనుకోవాలి, కొన్ని స్థలాలకు రాను అని చెప్పాలి, కొందరికి వద్దు/కాదు అని చెప్పటం వలన వారి మనస్సులను బాధపెట్టవలసి వస్తుంది. కాని దేవుని మాటకు విధేయులవ్వడానికిఆయనతో సహవాసము చేయడానికి విశ్వాసి చెల్లించే క్రయానికి నూరురెట్లు తిరిగి ప్రతిఫలమును ఇచ్చే ప్రభువు మాట నూటికినూరు శాతం సత్యం ( మత్తయి 19:29). ఆయన మనకు ప్రతిఫలమును చెల్లించే దినం సమీపిస్తుండగా మెలకువ కలిగి, మిగిలిన కాలమును సద్వినియోగం చేసుకుందాం (1పేతురు 4:2).

– విజే డెస్క్

## Crossword Puzzle

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | | | ■ | 3 |
| ■ | | ■ | 4 | ■ | ■ | |
| ■ | | 5 | | | 6 | |
| 7 | | | | | | |
| 8 | ■ | ■ | | ■ | | |
| | ■ | 9 | | | | |
| 10 | | | | | | |

**Horizontal**

1. Son of Mahalaleel, father of Enoch
5. The son of Baanah, David's valiant man
7. Great grandson of Herod the Great
9. A duke of Edom, descended from Esau
10. The minor prophet who believed in God's Electing love.

**Vertical**

2. The Poetic name of Amalek
3. The man who was a fool by name & nature
4. A chief among the Reubenites
6. Son of Jahdai, a Judahite
8. The man whose sin brought a curse





*Please find out the hidden words in the puzzle using the clues/hints and send to Nambur office within 15 days.*

**Last month key:**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| A | R | I | M | A | T | H | E | A |
| B | | S | O | | | A | | M |
| I | | H | R | | | R | | R |
| G | | M | D | A | V | I | D | A |
| T | | A | E | | | E | | M |
| H | | E | C | H | E | L | A | L |
| A | | L | A | M | E | C | H | |
| N | | | I | S | H | I | A | H |

1. *M. Ankarao, Guntur*
2. *T. Anand Babu & Koteswari, Chilakaluripet*
3. *R. Suma Srinivas, Staff, Tirupathi*

ఫిబ్రవరి 14







# ప్రేమకోసం...

ప్రేమ... అనే పదం చెవిన పడగానే యువత ఏదో తెలియని అనుభూతికి లోనవు తుంటారు. ప్రేమ కోసం ఎంతగానో తపిస్తూ ఆరాటపడుతుంటారు. ప్రేమించాలని ప్రేమించ బడాలని తహతహలాడుతుంటారు. తమ మనస్సుకు నచ్చిన వారిని ప్రేమిస్తూ వారితో ఇష్టాయిష్టాలు పంచుకోవడానికి వెంపర్లాడతారు. ఎందుకంటే ప్రేమ మానవుని అవసరత. ప్రేమ లేకుండా మానవుని సహజీవనం సాగడం చాలా కష్టతరం.

అంతగా ప్రేమ కోసం పరితపిస్తున్నా ఈ ప్రేమజీవి హేతువులేకుండా స్వప్రయోజనం ఆశించకుండా ప్రేమను ఇచ్చి పుచ్చుకోలేకపోతున్నాడు. ఎదుటివారి అందాన్ని, జ్ఞానాన్ని, నేపథ్యాన్ని చూసి ప్రేమ పేరిట వ్యామోహాల బారిన పడుతున్నాడు.

ప్రేమ ముచ్చట్ల కోసం ఫేసుబుక్,వాట్సాప్, ఇన్ స్టాగ్రామ్, స్మార్ట్ ఫోన్ల వెంటబడి, భావోద్వేగాలకు లోనై ఆలోచనలను మనస్సును మలినం చేసుకుంటూ, వాటిలో చిక్కుకొని కొట్టుమిట్టాడుతూ తమ బంగారు భవిష్యత్తును పాడుచేసుకొంటూ, తమనుతామే మోసం చేసుకొంటున్నారు.


నేటి సమాజంలో యువత ప్రేమ వ్యవహారాలలో వివిధమైన తప్పుడు ప్రలోభాలకు, వ్యామోహాలకు తావిచ్చి అసభ్య కార్యకలాపాలకు రహస్యంగా పాల్పడి, బ్రేకప్ అనంతరం నిరాశాపూరితమైన జీవితాలతో మనస్తాపానికి గురై అర్థాంతరంగా తమ జీవితాలను ముగిస్తున్నారు. మరికొందరు తమ హృదయంలో ఉన్న ప్రేమ వెలితితో ఒంటరితనాన్ని, ఆత్మన్యూనత భావాన్ని, డిప్రెషన్‌ని చవిచూస్తూ కుమిలిపోతున్నారు.

కానీ, నిజమైన ప్రేమ షరతులు లేకుండా నిష్పక్షపాతంగా, స్వార్థరహితంగా నిన్ను నిన్నుగా అర్థం చేసుకొని విడువక ప్రేమిస్తుంది. ఈ లోకప్రేమలన్నిటికి అతీతంగా ప్రేమించినవాడు కేవలం యేసుక్రీస్తు మాత్రమే. అవును, ప్రేమలో ఒంటరిగా అసంతృప్తితో అలసిపోయిన నీకై, అదృశ్యదేవుని స్వరూపియైన ఆయన తన మహిమను విడిచిపెట్టి, పాపరహితునిగా శరీరంలో పాలివాడై, స్వేచ్ఛాయుతంగా తన ప్రాణాన్ని క్రయధనంగా నీ స్థానంలో నీ పాపాలనిమిత్తం అర్పించి, సిలువ మరణం పొంది, సమాధి చేయబడి, మూడవ రోజున మరణాన్ని జయించి తిరిగి లేచి నీ యెడల తనకున్న అపారమైన ప్రేమను వ్యక్తపరిచాడు.

ప్రేమకు ప్రతిరూపం దైవమే. ప్రేమ దేవుని హృదయ స్పందన. నిజమైన ప్రేమ అమర్యాదగా ప్రవర్తించదు. ప్రేమ మోసపోదు, ఓడిపోదు. ప్రేమ అన్నిటిని ఓర్చుకుంటుంది. ప్రేమ పవిత్రమైనది. ఇటువంటి నిజమైన ప్రేమకు భాష్యం చెప్పిన యేసుక్రీస్తు ప్రేమను అందిపుచ్చుకోవడానికి, నీ పాపాల విషయమై ఆయన దగ్గర పశ్చాత్తాపపడి, ఆయనను దేవునిగా, ప్రభువుగా అంగీకరించు. మరణం కంటే బలమైన ఈ శాశ్వత ప్రేమను నీ సొంతం చేసుకో...

**– ఆర్. కరుణ్ కుమార్,** తుని

అవగాహన



# మాదిరి

**మనం రాయబోయే చరిత్ర పేపరు మీద రాసేది కాదు, వ్యక్తుల జీవితాల మీద రాసేది. ఇది నిజమని నమ్మితే, మన సామర్థ్యాలన్నిటిని కూడగట్టుకొని ఈ పనికొరకే శ్రమిస్తాము.**

**ఈ రంగంలో యేసుక్రీస్తు చేసిన పరిచర్యను అంచనా వేయుటకు చేసిన చిన్న ప్రయత్నమే ఈ ఆర్టికల్.**

## అరణ్య అనుభవం

సువార్తల్లో రాయబడిన క్రీస్తు యేసు శోధనపై అనేకమంది అర్థాలు చెప్పారు. నేను ఇచ్చే అర్థం ఏమిటంటే, సులభమైన పద్ధతుల ద్వారా (Short-cuts) పరిచర్య చేయాలనే శోధన ఇది. అంటే, అద్భుతాల ద్వారా లేక దేవుని వాక్యాన్ని బోధించుటకు బదులు సామాజిక అవసరాలు తీర్చడం ద్వారా సులభంగా చేయవచ్చు గదా అనే శోధన.

యేసు బాప్తిస్మం తీసుకొని, పరిశుద్ధాత్మను పొందిన వెంటనే, 40 రోజులు ప్రార్థించడానికి ఆయన అరణ్యానికి వెళ్ళాడు. తన సేవకు సంబంధించిన వ్యూహాన్ని, నియమాలను ఆలోచించుటకు ఆయన అలా చేసి ఉండవచ్చు. మూడు సూత్రాలతో తన 40 రోజుల ఉపవాస ప్రార్థనను ముగించాడు.

1. మనుష్యుడు రొట్టెవలన కాదుగానీ దేవుని నోట నుండి వచ్చు ప్రతి మాటవలన బ్రతుకును.
2. నీ ప్రభువును శోధించవద్దు.
3. నీ ప్రభువైన దేవునికి మ్రొక్కి, ఆయనను మాత్రమే సేవించాలి.

దమస్కు మార్గంలో యేసును చూసి, అననీయ దగ్గరకు వెళ్ళిన తర్వాత పౌలు కూడా ఇదే విధంగా కొంత సమయం ఒంటరిగా గడపడానికి అరేబియా వెళ్ళాడు. మనుష్యుల ప్రభావంతో కాకుండా దేవుని నుండి వచ్చే ఆలోచనలతో ముందుకు కొనసాగడానికి పౌలు ఇలా చేసి ఉంటాడని నా నమ్మకం.

దేవునితో ఏకాంతంగా గడిపే సమయం మనకు ఎంతో అవసరం, ప్రాముఖ్యం. దేవుడు మనకు -ఇచ్చిన పిలుపును, దేవునితో మనుష్యులతో మనకు ఉన్న సంబంధాలను, దేవుని వాక్య విలువను మరలా ఒకసారి గుర్తుచేసుకోవడానికి ఈ సమయం మనకు ఉపయోగపడుతుంది. అప్పుడే ఈ విషయాలపై ఇతరులకు ఆత్మవిశ్వాసంతో బోధించగలుగుతాము. ఇది ఎప్పుడో రక్షణ పొందిన తొలిరోజుల్లో చేసే పని కాదు. క్రమం తప్పకుండా దేవునితోను, దేవుని వాక్యంతోను మనం ఏకాంతంగా గడపాలి. పాతనిబంధన కాలంలో పండగ రోజుల్లో వారు మూడు వారాలు దేవుని సన్నిధిలో గడిపిన విధానాన్ని

గుర్తుంచుకొని, సంవత్సరానికి ఒక వారం రోజులు దేవుని సన్నిధిలో ఇలా ఏకాంతంగా గడపటానికి కేటాయించుకోమని నేను చెబుతూ ఉంటాను.

## ఒక జట్టును ఎంచుకో

అరణ్యము నుండి వచ్చిన వెంటనే యేసు ఆయా రంగాల్లో ఉన్న ప్రజలను పిలుచుకోవడం ప్రారంభించాడు. ఆయనకు చాలా దూరంగా ఉన్నవారిని అద్భుతాలతోను, బోధలతోను ఆకర్షించాడు. కాని ఆయనకు దగ్గరగా ఉండే 12 మంది జట్టు ఒకటి ఉన్నది. ఆయన తన సమయాన్ని, శక్తిని ఆ జట్టుమీద వినియోగించాడు. ఇంకా చాలా రకాల సమూహాలను ఆయన సంధించాడు. కాని ఇప్పుడు మనం ఈ 12 మంది ఉన్న జట్టు గూర్చే ఆలోచిద్దాం.

ఇశ్రాయేలు విమోచన పట్ల వారికి ఉన్న ఆసక్తి ఆధారంగా ఈ 12 మంది ఎన్నుకోబడ్డారు. పేతురు, అంద్రెయ, యాకోబు, యోహానుల ఆసక్తి వారి ప్రతిస్పందన ద్వారా అర్థమైంది. కానీ బాప్తిస్మం ఇచ్చు యోహాను విషయంలో అది అంత స్పష్టంగా లేదు. పన్నులు వసూలు చేయు అధికారియైన మత్తయి విషయంలో కూడా ఈ ఆసక్తి ఉన్నది. అందుకే అతను యేసును వెంటనే వెంబడించాడు.

ఇదే సూత్రాన్ని ఉపయోగించి మనలాంటి దర్శనం గలిగిన వ్యక్తులను గుర్తించి, ప్రణాళికాబద్ధంగా వారిని బలపరుస్తూ, ప్రోత్సహించాలి. తగిలితే తగులుతుంది, లేకుంటే లేదు అన్నట్లు కాకుండా, ప్రతి వ్యక్తికొరకు ప్రణాళిక కలిగియుండడం ఎంతో మంచిది. అతనికి లేదా ఆమెకు నేను నిర్విరామంగా ఎలా సహాయం చేయగలను? క్రమం తప్పకుండా ఉత్తరాలు రాయడం ద్వారానా లేక వ్యక్తిగతంగా కలవడం ద్వారానా? లేక బైబిల్ పఠనం ద్వారానా? ఇప్పుడు అతను లేక ఆమె ఏ స్థితిలో ఉన్నది? ఆ వ్యక్తికి ఎలా చెబితే బాగా అర్థమౌతుంది? ఈ పరిచర్యలో అనుభవం ఉన్నవాళ్ళు, ఆ వ్యక్తి అవసరాలు, అతనికి ఎంతవరకు తెలుసు, ఇంకా ఏమి తెలియజేయాలి వంటి మొ॥ అంశాలను గుర్తించమని సలహా ఇస్తారు. మన శ్రమకు తగిన ఫలితాన్ని పొందడానికి ఇది సహాయపడుతుంది.

## సంబంధాలను పెంపొందించుకోవడం

ఒక వ్యక్తిపై నేను ప్రభావం చూపాలంటే, నేను అతనితో దృఢమైన సంబంధాన్ని ఏర్పరచుకోవాలి. 12 మందితో సంబంధాలను ఏర్పరచుకొనే క్రమంలో యేసుక్రీస్తు ముందుగా చొరవచూపినట్లు మనం చూస్తాము. వచ్చి చూడమని ఆయన యోహాను, అంద్రెయలను ఆహ్వానించాడు (యోహాను 1:38,39). తద్వారా ఆయన వారితో మంచి సంబంధాన్ని ఏర్పరచుకొన్నాడు. ఆయన పట్ల వారికి ఉన్న అవగాహనలో చాలా మార్పువచ్చింది. మొదట వారు ఆయన్ను రబ్బీ అన్నారు (యోహాను 1:38). తర్వాత ఆయనే మెస్సీయ అని గ్రహించారు (యోహాను 1:41).

నేను వ్యక్తిగతంగా ఎదుర్కొనే సమస్య ఏంటంటే, ఇతరులను నా వద్దకు పిలవడానికి నేను సందేహిస్తాను. నేను అలా చేయలేను కాబట్టే నేను వారిని పిలిచి నేర్పించగల అర్హత నాకు లేదు. వారే నా దగ్గరకు వచ్చేంతవరకు నేను వేచి ఉండేవాడిని. తద్వారా నేనే అనేక అవకాశాలు కోల్పోయినప్పటికీ, దేవుడు నా దగ్గరకు నడిపించిన వారందరిమీద నేను చాలా వెచ్చించాను. తద్వారా నేను, వారు ఎన్నో ఆశీర్వాదాలను మేళ్ళను పొందాము.

ప్రజలు నీ దగ్గరకు రాలేకపోతున్నారు. నీవు పిలుస్తావని ఎదురు చూస్తున్నారు. పరిచర్య చేస్తుంది మనం కాదు, మన ద్వారా పరిశుద్ధాత్ముడు చేస్తాడని గుర్తుంచుకోవాలి. కాబట్టి ధైర్యం చేసి ఒక అడుగు ముందుకేయాలి. ప్రజలతో సంబంధాలు ఏర్పరచుకొని వారిని ఆహ్వానించాలి. ఇది మొదట గుర్తించాలి, ఆ తర్వాత ఆహ్వానించాలి. దీన్ని మన స్ఫూర్తిగా చేయాలి.




ప్రజలు తమ అంతరంగిక అనుభూతులు, అవసరాలు నీతో పంచుకోగలిగేంత లోతైన, పారదర్శకతతో కూడిన వ్యక్తిగత సంబంధాలను నీవు కలిగి ఉండాలి. యేసుక్రీస్తు కూడా అపొస్తలులతో ఇలాంటి సంబంధాన్నే కలిగి ఉన్నాడు. మనం కూడా ఇతరుల అవసరాలను తెలుసుకోవడానికి వాటిని తీర్చుకోవడానికి ఆసక్తిని చూపాలి.

## బోధించడం

యేసుక్రీస్తు తన శిష్యులకు వేదాంతపరమైన మర్మాలను బోధించలేదు. దైనందిన జీవితంలో వారు ఎదుర్కొనే పరిస్థితులను గూర్చి ఆయన బోధించారు. ఆయన యెరూషలేముకు వచ్చిన సందర్భాల్లో, వేదాంత పండితులతో జరిగిన చర్చల్లో మాత్రమే ఆయన వేదాంత విషయాలను ప్రస్తావించాడు.

కొండమీద ప్రసంగాన్ని గమనిస్తే అందులో అనుదిన జీవితంలో ఎదుర్కొనే కోపం, వ్యభిచారం, అణచివేత, భవిష్యత్‌గూర్చిన ఆందోళన మొ॥ అంశాలను గుర్తిస్తాము (మత్తయి 5:21–28; 6:25). నేను ఒక వ్యక్తికి ముందు ఈ విషయాలనే బోధించి, ఆ తర్వాతే వేదాంతపరమైన విషయాలు నేర్పించేవాడిని. ముందు మనం వారికి అనుదిన జీవితానికి సంబంధించిన విషయాలలో శిక్షణ ఇవ్వాలి. ద్వితి 6:7–9 లో రాయబడినట్లు, ఈ విషయాలను తరగతి గది బోధనలాకాకుండా స్నేహపూర్వక వాతావరణంలో బోధించాలి. వారు విఫలమైనప్పుడు, లేదా ఒక విషయాన్ని ఆచరించడానికి ఇబ్బందిపడుతున్నప్పుడు, లేదా ఇలాంటి క్రమశిక్షణ అవసరమేనా అని ఆలోచిస్తున్నప్పుడు వేదాంతపరమైన అంశాలను బోధించాలి. ఉదా॥ ఒక నూతన విశ్వాసికి సంఘాన్ని గూర్చి వేదాంతాన్ని చెప్పడంకంటే, సంఘానికి క్రమంగా హాజరవ్వడం మంచిది. మేనేజ్‌మెంట్ శిక్షణ ప్రారంభమైనప్పుడు వారు ఆ శిక్షణ ప్రారంభించకముందే రెండు లేదా మూడు సం॥ వరకు ఒక వ్యక్తికి అభ్యాసంచేయించాలి అన్న ఆలోచన వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం ఇదే.

అపొస్తలుల విషయాలలో కూడా ప్రభువు తన పరిచర్య చివరిభాగంలోనే ఆయనకు సంబంధించిన క్లిష్టమైన సిద్ధాంతాలను ఆయన వారికి బోధించాడు (మత్తయి 17:1–13). ప్రాథమికమైన అభ్యాసాలు, వేదాంత విషయాలు రెండూ ప్రాముఖ్యమే కాని సాధారణంగా మనం (పాశ్చాత్య దేశాల అలవాటు



ప్రకారం) ముందు సిద్ధాంతం నేర్చుకొంటాము, తర్వాత అభ్యాసం చేస్తాము. కాని జీవితానికి సంబంధించిన విషయాలు వచ్చేసరికి, ముందు అభ్యాసం చేయాలి, ఆ తర్వాత సిద్ధాంతాలు నేర్చుకోవాలి.

## బాధ్యతలు అప్పగించడం

ప్రాథమిక అంశాలు నేర్పించిన తర్వాత వాటిని పరిచర్యలో ఆచరించమని ప్రోత్సహించాలి. ఈ క్రమంలో వారికి కొన్ని బాధ్యతలను అప్పగించాలి. లూకా 10వ అధ్యాయంలో శిష్యులు సువార్త ప్రకటించడానికి, సూచకక్రియలు అద్భుతాలు ఇశ్రాయేలు పట్టణాలలో జరిగించడానికి యేసు ఇద్దరిద్దరిని పంపించినట్లు మనం చూస్తాము. లూకా 10:17లో విజయోత్సాహంతో వారు తిరిగి ఆయన వద్దకు వచ్చినట్లుకూడా మనం చూస్తాము.

## సమీక్ష, ప్రోత్సాహం

విజయం అత్యంత ప్రోత్సాహపరిచే విషయం, అపజయం అత్యంత నిరుత్సాహపరిచే విషయం అని నేను గమనించాను. కాబట్టి వారు తమ పనిలో సాధించగలిగేటట్లు మనం వారికి స్పష్టమైన సూచనలు, అవసరమైనంత మార్గదర్శకత్వం మనం వారికి ఇవ్వాలి. అనుకున్న విధంగా వారు చేయలేనప్పుడు ఎక్కడవారు బాగా చెయ్యలేకపోయారో గుర్తించి, ఇంకాస్త మంచిగా చేసేటట్లు వారిని ప్రోత్సహించాలి. యోహాను 21వ అధ్యాయంలో ఒక చక్కని ఉదాహరణ మనం చూస్తాము. సిలువ మరణం తర్వాత పేతురు ప్రవర్తించిన తీరును ప్రభువు గద్దించి, పరిచర్య చేయమని అతనిని ప్రోత్సహించాడు.



## ముగింపు

మెంటరింగ్ అనేది క్రైస్తవ జీవితంలో చాలా ప్రాముఖ్యమైన పని. సండేస్కూల్ లాంటి పరిచర్యలో ఉన్నవాళ్ళు తమ పరిచర్యలో మెంటరింగ్ ఒక భాగంగా భావించి పనిచేస్తుంటారు. అయితే, సండేస్కూల్ ఉపాధ్యాయులు మాత్రమే చేయవలసిన పనికాదు, ఇది క్రైస్తవులందరూ చేయవలసిన పని. ప్రతి విశ్వాసి మనఃపూర్వకంగా, ఒక బాధ్యతలాగా భావించి యౌవ్వన విశ్వాసులను లేదా కొత్తగా విశ్వసించినవారిని బలపరచి, ప్రోత్సహించవలసిన అవసరం ఉంది. ఈ పాత్రను బాధ్యతతో నిర్వహిస్తావా?

దేవుడు మనల్ని ఏఏ రంగాలలో పరిచర్యకు పిలిచాడో ఆయారంగాలలోని ప్రజలను మాత్రమే మనం ప్రభావితం చేయగలం. అయితే, పరిచర్యకు సంబంధించిన విషయాలలోనే కాదు, మన జీవితం, కుటుంబం మొ॥ విషయాలలో మనకు మరికొంత స్పష్టత అవసరం. ఉదాహరణకు, నేను ఎవర్ని? ఎందుకు పిలువబడ్డాను? ఎలాంటి జీవితం జీవించడానికి పిలువబడ్డాను వంటి మొ॥ విషయాలలో మనకు ఇంకొంచెం స్పష్టత అవసరం. మనం ప్రజలపై చూపే ప్రభావం సాధారణంగా పై విషయాలలో మనకు ఉన్న స్పష్టతపై ఆధారపడి ఉంటుంది.

(క్యాంపస్‌లింక్ సౌజన్యంతో)

– **పి.కె.డి.లీ,** హైదరాబాద్

*వీరు భారతీయ రైల్వేస్‌లో 20సం॥ ఉద్యోగం చేసిన తర్వాత హగ్గయి ఇన్‌స్టిట్యూట్‌లో 20సం॥ సేవచేసారు. ప్రస్తుతం రిటైరై హైదరాబాద్‌లో ఉంటున్నారు.*

**కవిత**



# నీ ఆసక్తి దేనిమీద?

పాపం చేయడానికి ఉండే ఆసక్తి
ప్రార్థన చేయడానికి లేదా?

ధనాన్ని, లోకాన్ని ప్రేమించడానికి ఉండే ఆసక్తి
దేవుడిని, దైవకార్యాలను ప్రేమించడానికి లేదా?

నిరాశ పరచడానికి ఉండే ఆసక్తి
నీ తోటి వారిని ప్రోత్సహించడానికి లేదా?

వార్తలు చదవడానికి ఉండే ఆసక్తి
వాక్యం చదవడానికి లేదా?

ఎవరినో విమర్శించడానికి ఉండే ఆసక్తి
ఎదలో ఉన్న కపటానికి తొలగించడానికి లేదా?

మనుష్యులను అనుకరించడానికి ఉండే ఆసక్తి
మాదిరియైన యేసయ్యను అనుసరించడానికి లేదా?

నీ ఆసక్తి దేనిమీద?

– **కె.యేసురత్న కుమార్**
తాడేపల్లిగూడెం ఇయువిద్యార్థి

## విద్యార్థుల రచనలకు ఆహ్వానం

దేవుని కొరకు రాయాలనే ఆసక్తిగల సీనియర్ విద్యార్థులకు విద్యార్థిజ్వాల ఆహ్వానం పలుకుతుంది. కళాశాలలో మీ అనుభవాలు, ట్రెండ్స్, ఆర్టికల్స్, సాక్ష్యాలు, కవితలు, కార్టూన్స్ మొదలగునవి ప్రతి నెల 10వ తేదీలోపు మా ఇమెయిల్ editorvj@gmail.com కు పంపగలరు. ఈ చక్కటి అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోగలరు.

– **పి. సునీల్ జాకబ్,** ఎడిటర్



# మీ సమస్యలు... మా సలహాలు

**సమస్య:** విశ్వాస విద్యార్థులు కాలేజ్‌లో, మీటింగ్స్‌లలో ఒకేలా ఉండకుండా రెండు ప్రవర్తనలు కలిగి ఉంటున్నారు. ఎందుకు ఉంటున్నారు? ఈ సమస్యను ఎలా అధిగమించవచ్చు?

**సలహా:** విద్యార్థులందరూ ఇలా ఉంటున్నారని చెప్పలేం. కొందరు అక్కడ, ఇక్కడ ఒకే విధంగా, యధార్థంగా జీవిస్తున్న వాళ్ళు లేకపోలేదు. రెండు రకాల ప్రవర్తనలు కలిగి ఉండడాన్ని వేషధారణ అంటారనీ, అది మన ప్రభువుకి అసహ్యమనీ (మత్తయి 23:13,15) గుర్తించాలి. అలా గుర్తించి దాన్లోనుంచి బయటపడాలన్న ఆశ గలవాళ్ళు మాత్రమే ఈ సమస్యను అధిగమించగలరు. ఇలా ప్రవర్తించడానికి చాలా కారణాలు ఉన్నాయి. స్థలాభావంవల్ల కొన్ని కారణాలు మాత్రమే చూద్దాం.

**1. దైవభయంలేక:** సహవాస భయం ఉందిగానీ, దైవభయం (గౌరవంతోకూడుకున్న భయం) లేదన్నమాట. మన ప్రభువు సర్వవ్యాపి అని నమ్ముతున్నామని నోటితో చెబుతున్నాం గాని హృదయమార విశ్వసించడంలేదు. మన నమ్మకం మన నడవడిని ప్రభావితం చెయ్యాలి. మనం ఒంటరిగా ఉన్నా, చీకటిలోవున్నా, కాలేజ్‌లో ఉన్నా, సంఘంలో ఉన్నా, ఇయులో ఉన్నా, లెక్చరర్ క్లాసులో లేకపోయినా, ఇన్విజిలేటర్ ఉన్నా లేకపోయినా ప్రభువు చూస్తున్నాడనీ (కీర్తనలు 139:5-10), ఆయన పరిశుద్ధుడనీ, మనం పరిశుద్ధులంగా ఉండాలని కోరుకొంటున్నాడనీ ( 1పేతురు 1:14), మనం ఆయనకు లెక్క అప్పజెప్పాలన్న అవగాహన/గ్రహింపు ఉంటే అలా ప్రవర్తించం.

**2. వ్యక్తిగత రక్షణలో ప్రాధాన్యతలు సరిలేక:** మన వ్యక్తిగత రక్షణలో మొదటిది మారుమనస్సు, రెండవది విశ్వాసం (మార్కు 1:14). కొందరి రక్షణ అనుభవంలో సరియైన పశ్చాత్తాపానికి/మారుమనస్సుకు ప్రాధాన్యమివ్వక పోవడం, తమ పాత జీవితంలోని పాపం పట్ల రోత కలగకుండా, క్రీస్తు తమపట్ల చూపిన ప్రేమకు ముగ్ధులు కాకుండా నిర్ణయాలు తీసుకోవడం కూడా ఇలాంటి ద్వంద్వ ప్రవర్తనకు చాలావరకు కారణం.

**3. వెలచెల్లించలేక:** కాలేజ్‌లో క్రీస్తుకు సాక్షిగా జీవిస్తే తనను ఎగతాళి చేస్తారనో, తక్కువగా చూస్తారనో భయపడి అవిశ్వాసులతో రాజీపడి జీవిస్తూ ఉండవచ్చు. బహిరంగంగా ఆయనను ఒప్పుకొంటే చెల్లించాల్సిన వెల ఇంకా ఎక్కువ కావచ్చు. కాని తాను చెల్లించే వెలకంటే (పోగొట్టుకొనేదాని కంటే) పొందే బహుమానం ఎంత గొప్పదో అర్థమైతే (రోమా 8:18) అలాంటి ద్వంద్వ ప్రవర్తనకు తావివ్వం. "పోగొట్టుకుందామన్నా పోనిదాన్ని పొందడం కోసం ఎలాగూ పోయేదాన్ని వదులుకునేవాడు బుద్ధిహీనుడు కాదు"అని అంటాడు జిమ్ ఇలియట్.

**4. రుచితెలియక:** లోకంలో ఉన్న అశాశ్వతమైన, తుచ్ఛమైన ఆనందం రుచి వదులుకున్న విశ్వాసి ప్రభువుతో, ప్రభువు బిడ్డలతో గడపడం వల్ల, పరిశుద్ధంగా జీవించడం వల్ల కలిగే శాశ్వతమైన, అసలుసిసలైన ఆనందాన్ని (1పేతురు 1:9) రుచి చూడకపోవడం వల్ల అలా ప్రవర్తిస్తూ ఉండవచ్చు.

పై విషయాలన్నీ వాళ్ళకు తెలియజేయడంతోపాటు, మన వ్యక్తిగత అనుభవాలు కూడా వారితో పంచుకొంటే అలాంటి ద్వంద్వ ప్రవర్తన విడిచిపెట్టి యధార్థంగా జీవించడానికి వీలవుతుంది.

**సమస్య:** ఇయు విద్యార్థులకు కాలేజీల్లో మొదటి, రెండు, మూడు ర్యాంకులు ఎందుకు రావడంలేదు? చదువు పట్ల విశ్వాస విద్యార్థుల దృక్పథం ఎలా ఉండాలి?

**సలహా:** గతంలో చాలా మంది విద్యార్థులకు

మంచిర్యాంకులు వచ్చాయి. ఇప్పుడూ కొద్దిమందికి వస్తూనే ఉన్నాయి. ఆశించినంతగా రావడంలేదు. చాలామందిలో సాధించాలనే ఆరాటం, తపన లేకపోవడం, అసాధ్యాలను సుసాధ్యం చెయ్యగల మన ప్రభువు సహాయంతో వాటిని అందుకోగల మనే ధీమా లేకపోవడం ముఖ్య కారణాలు. ఇంకొన్ని కారణాలు చూద్దాం.

**1. నేపథ్యం:** తెలివితేటల్లో, సామాజికంగా, ఆర్థికంగానూ మంచి నేపథ్యం ఉన్న విద్యార్థులు మన మీటింగ్స్‌కు రాకపోవడం, ప్రభువునంగీకరించకపోవడం మనం చూస్తూనే ఉన్నాం (1 కొరింథీ 1:26-29). వారు దేవుని అవసరాన్ని అంతగా గుర్తించకపోవడం ఒక కారణం. ఇయు విద్యార్థుల్లో ఎక్కువమంది తెలుగు మీడియంలో, ప్రభుత్వ స్కూళ్ళలో చదువుకోవడం, వారి తల్లిదండ్రులు పామరులై ఉండడం వల్ల వారిని సరిగా గైడ్‌చెయ్యలేకపోవడం కారణం కావచ్చు. 'ఇవన్నీ లేని మేము, ఇవన్నీ ఉన్న వారితో ఎలా పోటీపడగలం?' అని మీరనవచ్చు. (దావీదు గొల్యాతు మీద గెలవలేదా? దానియేలు అతని మిత్రులు అన్యులకంటె ఆధిక్యం కనపరచలేదా?). అలాంటివారు ప్రభువునంగీకరించి ఆయనను వేడుకుంటే (యాకోబు 1:5) మన ప్రభువు వారి మనస్సుల్ని ప్రభావితం చేసి (రోమా 12:1), జ్ఞానంతో నింపి వారిని తలగా ఉంచడం చూస్తూనేఉన్నాం. నా మట్టుకు నేను ఓ కుగ్రామంలోని తెలుగు మీడియం మిషన్ స్కూల్లో చదివి ప్రభువు కృపవల్ల ఓ ప్రఖ్యాత సెంట్రల్ యూనివర్శిటీలో పిజిలో ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకోగలిగాను. సుధాకర్ మొండితోక, తాళ్ళూరి ప్రసాద్‌లాంటి వాళ్ళింకెందరో! ఈ తరంలోనూ అలాంటి స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్ గురించి విద్యార్థి జ్వాలలో చూస్తూనే ఉన్నాం.

**2. సమయం:** పరిచర్య కోసం చాలా సమయం వెచ్చించడం వల్ల ర్యాంకులు తెచ్చుకోలేకపోతున్నామని కొందరివాదన. అది సత్యదూరం. అవిశ్వాస విద్యార్థులు గాసిప్‌కీ, ఇంటర్నెట్‌కీ, సినిమాలకీ వ్యర్థంచేసే సమయాన్నే మనం పరిచర్యకు వినియోగిస్తున్నాం. ప్రతి ఇయు విద్యార్థి వారానికి ఒక ఇబియస్ (1.30గం॥), ఓ బిబియస్ (2గం॥), ఓ మైక్రో ప్రేయర్ సెల్ (0.30ని), నెలకోసారి ప్రార్థనకు (2గం॥) మాత్రమే వెచ్చించి మిగిలిన సమయాన్ని సద్వినియోగం (ఎఫెసీ 5:15) చేసుకొని చదువుద్వారా కూడా ప్రభువుకు మహిమతేవాలనే ఆరాటంతో, కసిగా చదవాలి. పరిచర్య పేరుతో పిచ్చాపాటి మాట్లాడుకోవడం సరికాదు. చురుగ్గా ఉండడం (హెబ్రీ 6:11), ఉదయాన్నే లేవడం, త్వరత్వరగా కాలకృత్యాలు తీర్చుకొని క్వైట్‌టైమ్ ముగించుకొని కనీసం 2గం॥లు ఆ రోజు చెప్పబోయే పాఠాలు చూసుకొని, కాలేజ్‌కి వెళ్ళి, ప్రతిక్లాస్‌కి హాజరై, ప్రతిలెక్చరర్ పాఠాన్ని జాగ్రత్తగా విని, రన్నింగ్‌నోట్స్ రాసుకొని, రూమ్‌కివచ్చి సాయంత్రం కొంచెం రిలాక్స్ అయ్యి మినిస్ట్రీకి, ఇంటిపనులకు ఒక గంట వెచ్చించి, భోజనం చేశాక, ఇంకోరెండు గంటలు ఆరోజు విన్న పాఠాలు చదువుకొని ప్రేయర్ చేసుకొని చక్కగా నిద్రపోదాం. ప్రతీరోజు చదవడం సాధ్యం కాదనిపించవచ్చు. సాధ్యమని రుజువు చేసి చూపిస్తున్న అవిశ్వాసుల గురించి రోజూ వార్తాపత్రికల్లో చదువుతున్నాం. అలా రుజువు చేసి చూపిస్తున్న ఇయు విద్యార్థుల్ని నేనెరుగుదును. పరీక్షకోసం కాదు, సబ్జెక్ట్ మీద కమాండ్ (జ్ఞానం) కోసం చదువుదాం. అదే చదువుపట్ల విశ్వాస విద్యార్థికుండవలసిన దృక్పథం. సబ్జెక్ట్‌మీద కమాండ్ లేకపోవడం వల్లనే పరీక్షల్లో చాలా మంచి మార్కులు తెచ్చుకొని కూడా కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌లో విజయం సాధించలేకపోతున్నాం. 'పరీక్షలు సెమిస్టర్ చివరికో, సంవత్సరం చివరికోవుంటే, ఇప్పుడు చదివిందేం గుర్తుంటుందనే' పిచ్చిలాజిక్కులాపేద్దాం. సిలబస్ అంతా చదవడం మన పని. తగిన సమయంలో దాన్ని గుర్తుచెయ్యడం పరిశుద్ధాత్ముని పని. అదే విశ్వాసిగా మనం చెయ్యాలని దేవుడు మన నుండి ఆశిస్తున్నాడు. పరీక్షల ముందు మాత్రం ప్రాముఖ్యమైన చాప్టర్స్, ముఖ్యమైన క్వశ్చన్ ఆన్సర్ మీద దృష్టిపెడదాం. మనం పిలువబడింది చదువులో రాణిస్తూనే మనల్ని ఉంచిన క్యాంపస్‌లో ప్రభువుకు సాక్షులుగా బ్రతకాలని. అందులో మన ప్రయత్నలోపం లేకుండా చూసుకుందాం (ప్రసంగి 9:10).

**(జవాబులతోపాటు బ్రాకెట్లలో ఇచ్చిన బైబిల్ రిఫరెన్స్‌లు తప్పక చదవాల్సిందిగా మనవి)**

**పి.జాన్ విక్టర్‌గారు,** కర్నూలు ఇజియఫ్ గ్రాడ్యుయేట్. వీరు కోల్‌కత్తాలో సిండికేట్ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తూ వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకొన్నారు. ప్రస్తుతం యుఇయస్ఐ నేషనల్ బోర్డ్ ప్రెసిడెంట్‌గా ఉంటున్నారు.



# పరిశుద్ధత
## అనుదిన జీవితంలో

రెవ. డ్యాన్ ఎడ్వర్డ్స్ యూదుల మధ్య పరిచర్య చేయడానికి అభిషేకించబడిన తర్వాత 1840, అక్టోబర్ 2న రాబర్ట్ ముర్రే మెక్‌కెయిన్ అతనికి రాసిన మాటలను మనం జాగ్రత్తగా గుర్తుంచుకోవాలి: "దేవుడు గొప్పగా సంతోషించేది మనలోని తలాంతులను చూసికాదు, మనలోని క్రీస్తు స్వరూపాన్ని చూసి. ఒక పరిశుద్ధమైన పరిచారకుడు దేవునిచేతిలో ఒక బలమైన ఆయుధంగా ఉంటాడు". చాఫర్ అనే వ్యక్తి ఇలా అన్నాడు: "భూలోకంలో రహస్యంగా చేసే పాపం, పరలోకంలో ఒక బహిరంగ కుంభకోణంలా కనిపిస్తుంది".

నన్ను కొన్ని విషయాలు సూటిగా చెప్పనివ్వండి. సౌకర్యవంతమైన ఆత్మీయజీవితాన్ని ఎవ్వరూ అనుభవించరు. మనం అందరమూ సవాళ్ళు, సమస్యలగుండా వెళ్తుంటాం. మనం పడిపోతాం, విఫలమౌతాం, పరిస్థితులను చిందరవందరగా చేసుకుంటాము. ఈ సమస్యలన్నిటికీ పరిష్కారం ఒకే ఒక వ్యక్తి దగ్గర ఉంటుందని మనం భావిస్తాం. ఆ ఒక్క వ్యక్తే పాస్టర్ లేదా వాక్యాన్ని బోధించే వ్యక్తి. మన వైఫల్యాలన్నిటినీ, మన అపజయాలన్నిటినీ విజయాలుగా మార్చే రహస్యం అతని వద్ద ఉందని మనం భావిస్తాం. అతను ఎన్నడూ అపజయం పొంది ఉండడని అతని ప్రార్థనలు గంటకు 120 కిలోమీటర్ల వేగంతో పరలోకం చేరతాయని భావిస్తాము. అలా కానేకాదు. మీరు ఎదుర్కొన్న సమస్యలన్నిటినీ ఒక పాస్టర్‌గా నేనుకూడా ఎదుర్కొన్నాను. నేను విఫలమయ్యాను, పడిపోయాను, అనేకసార్లు పరిస్థితులను చిందరవందర చేసుకున్నాను. అనేక గందరగోళ పరిస్థితులను ఎదుర్కొన్నాను. నా ఆలోచనలు, తలంపులతో నేనుకూడా యుద్ధం చేయాల్సి వస్తుంది. అనేక శోధనలతో నేను సతమతమౌతుంటాను. తరచూ నాకు నేను ఇలా చెప్పుకుంటాను "అయ్యో, నేను ఎంత దౌర్భాగ్యుడను".

మనం అందరం ఒకే రకమైన పోరాటాన్ని ఎదుర్కొంటున్నాం. అదేంటంటే పరిశుద్ధ జీవితాన్ని జీవించడానికి పోరాడటం. అయితే, మన పోరాటాలలో ఏవీ కూడా దేవుని వాక్యాన్ని నిరర్థకం చేయజాలవు. "నేను పరిశుద్ధుడను గనుక మీరును పరిశుద్ధులైయుండుడి". యేసుక్రీస్తు ఇలా చెప్పాడు "మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా ఉండండి" (మత్తయి 5:48). తప్పించుకునేందుకు అవకాశంలేదు. నీవు దేవుని బిడ్డవైతే, నీవు పరిశుద్ధుడవే. నీకు ఇష్టమున్నా, లేకపోయినా ఇది నిజం. మనం దేవుని పిల్లలంగా ఉండునట్లు ఆయన మనల్ని పరిశుద్ధులనుగా ప్రకటించాడు. ఇది ఒక సత్యము. అయితే, పాప కాలుష్యంతో నిండిన ఈ లోకంలో పరిశుద్ధంగా జీవించడానికి మనం పోరాటం చేయాల్సి ఉంటుంది. పాపము మరియు దాని భిన్న రూపాలతో మనం ప్రతిరోజు యుద్ధం చేయాల్సిందే. మనం ఎన్నిసార్లు పడిపోతామో, సాతాను మనల్ని అంతగా

నిందిస్తాడు. మనం ఎంత నిందించబడతామో, అంతగా అపరాధభావంతో నలిగిపోతాము. చివరకు మనం ఇలా అనుకుంటాం: "నేను పరిశుద్ధంగా జీవించలేను బాబోయ్, నావల్లకాదు". పందుల దొడ్డిలో ఉండడానికి మనం శిక్షణ పొందాల్సిన అవసరం లేదు. కొన్ని నిమిషాలు అందులో ఉండి ఆ వాసనను భరిస్తే, నిదానంగా దానికి అల వాటు పడిపోతాము. పాప కాలుష్యంతో నిండిన ఈ లోకంలో పరిశుద్ధంగా జీవించడం నాకు సాధ్యపడుతుందా? దైనందిన జీవితంలో పరి శుద్ధంగా జీవించడం సాధ్యమేనా?

క్రైస్తవ జీవితానికి సంబంధించి అత్యధికంగా చర్చకు వచ్చే విషయాలలో పరిశుద్ధత అనే అంశము ఒకటి. ఇతరులను తీర్పు తీర్చడం లేదా నిందించడం నేను చేయబోను. అయితే, పరిశుద్ధత అంటే ఏమిటో నా స్వంత మాటల్లో నిర్వచిస్తాను. "పరిశుద్ధత అంటే దేవుడు ఆశించిన వాటిని ఆశించడం, దేవుని సంతోషపరిచే వాటిని చేయడానికి కృషిచేయడం, తద్వారా దేవుని స్వరూపంలోనికి మార్చబడుతూ దేవుని ప్రతిబింబాలుగా ఈ భూమి మీద జీవించడం". పరిశుద్ధతంటే. మనం చనిపోయిన తర్వాత పొందేది కాదు మనం చనిపోయిన తర్వాత దుర్వాసన తప్ప మరొకటి మన నుండి రాదు. పరిశుద్ధత అంటే మనం ఈ లోకంలో జీవించినప్పుడే దేవుని పరిమళ వాసనను వెదజల్లడం.

ఇక్కడ నేను మీతో నిర్మొహమాటంగా చెప్ప దలచుకున్న విషయం ఏంటంటే, పరిశుద్ధంగా జీవించండి. పరిశుద్ధతకు సంబంధించి ప్రజలు అత్యంత తరచుగా చేసే ఫిర్యాదు ఏంటంటే, "నేను ఎన్నోసార్లు ప్రయత్నించాను, కానీ ఉండ లేకపోతున్నాను, బహుశా నేను సృష్టించబడింది దానికోసం కాదేమో". మనం తప్పుగా ప్రారంభిస్తే అదుపు తప్పి క్రిందపడిపోతాము. దైనందిన జీవితంలో పరిశుద్ధతను కలిగి ఉండడానికి చేసే ప్రయత్నం మొదట మనం దేవుని వద్దే చేయాలి. పరిశుద్ధంగా జీవించడానికి బైబిల్ చెప్పే కారణా లను 2 కొరింథీ 6:14-7:1 నుండి నేను మీకు తెలియజేస్తాను.

వివాహ సందర్భాలలో ఈ వాక్యభాగాన్ని ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. వైవాహిక జీవితానికి ఈ వాక్యభాగాన్ని అన్వయించడం తప్పుకాకపోయినప్పటికీ, ఈ వాక్య భాగపు ఉద్దేశం వివాహ సంబంధమైన విషయాలను వివరించడం కాదు. దీని ముఖ్య ఉద్దేశం - దైనందిన జీవితంలో పరిశుద్ధంగా జీవించడానికి దేవుని పిలుపు. బహుశా అన్యుల పద్ధతులను పాటించకూడదని తెలియజేసే సందర్భమై ఉండొచ్చు. కొరింథీ సంఘంలో చాలా సమస్యలు ఉన్నాయి. తమ హృదయాలను తెరవమని పౌలు వారిని కోరుతున్నాడు (2 కొరింథీ 6:11). మనం పరిశుద్ధంగా ఎందుకు జీవించాలి అనే విషయానికి సంబంధించి కనీసం నాలుగు విషయాలు ఇక్కడ ఉన్నాయి.

### 1. దేవుని సన్నిధి (16వ):

"నేను వారిలో నివసించి సంచరింతును, నేను వారి దేవుడనైయుందును. వారు నా ప్రజలై యుందురు" ఈ 16వ వచనం లేవీయకాండము 26:11 నుండి ఉటంకించడం జరిగింది. "నేను మీ మధ్య నడిచెదను మీకు దేవుడనైయుందును మీరు నాకు ప్రజలై యుందురు". ఇశ్రాయేలు జాతి ఉనికికి ఇది కీలకమైన విషయం. దేవుడు తన ప్రజల మధ్య జీవిస్తాడు. తద్వారా దేవునితో వారి సంబంధం బలపడడాన్ని వారు అను- ుభవ పూర్వకంగా తెలుసుకోవాలని ఆయన ఆకాంక్ష. పాతనిబంధన కాలంలో ఇశ్రాయేలు జనాంగమే దేవుని నివాసము. అయితే, ప్రభువైన యేసుక్రీస్తు మూలంగా ఈ విషయంలో చిన్న మార్పు జరిగింది. "క్రీస్తు మీ హృదయములలో విశ్వాసముద్వారా నివసించునట్లుగా..." అని ఎఫెసీ 3:17లో మనం చదువుతాం. ఇదే విషయాన్ని 1 కొరింథీ 3:16లో "మీరు దేవుని ఆలయమైయున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా?" అని చదువుతాం. అవును ఈ రోజుల్లో దేవుడు మన మధ్యనే కాదు, క్రీస్తునందు విశ్వాసము ద్వారా ఆయన మన హృదయాల్లో జీవిస్తున్నాడు. మనం దేవుని ఆలయమై ఉన్నాము. దేవుడు మనలో నివసిస్తున్నాడన్న సత్యపు వెలుగులో మనం అనుదిన జీవితంలో ఇంకెంత పరి శుద్ధంగా జీవించాలో ఆలోచించండి. దేవుని సన్నిధి మన మధ్యనేకాదు, మనలోనే ఉన్నదన్న సత్యము మనం పరిశుద్ధంగా జీవించడానికి బైబిల్ చెబుతున్న మొదటి కారణము.

### 2. దేవుడు మన తండ్రి (వ.17,18):

"కావున మీరు వారి మధ్యనుండి బయలు వెడలి ప్రత్యేకముగా ఉండుడి. అపవిత్రమైన దానిని

ముట్టకుడని ప్రభువు చెప్పుచున్నాడు. మరియు నేను మిమ్మును చేర్చుకొందును, తండ్రినైయుందును, మీరు నాకు కుమారులును, కుమార్తెలునై ఉందురని సర్వశక్తిగల ప్రభువు చెప్పుచున్నాడు". ఈ వచనాలను పౌలు యెషయా 52:11 మరియు యెహెజ్కేలు 20 నుండి ఉటంకించాడు. ఇశ్రాయేలును పాతనిబంధన గ్రంథము ఒక పరిశుద్ధమైన జనాంగముగా, దేశముగా పిలిచింది. లోకములోని అపవిత్రత నుండి వీరు వేరుపరచబడ్డారు. దేవుని కోసం ప్రత్యేకించబడ్డారు. పరిశుద్ధంగా జీవించడంలో వారు విఫలమై, ఈ లోకం పోకడలచే కళంకితులై, బబులోనుకు చెరపట్టబడ్డారు. మీరు బబులోను చెర నుండి విడిపించబడినప్పుడు, అక్కడ నుండి ఏమీ తీసుకురావద్దు అని యెషయా తెలియజేశాడు. ఈ విషయాన్ని 18వచనంలో ఇంకాస్త వివరించడం జరిగింది.

దేవుడు మన తండ్రి. మనం ఆయన పిల్లలుగా ఉండడానికి పిలువబడ్డాము. లోకంలోని మలినం నుండి విడిపోవాలి, దేవునితో కలిసిపోవాలి. తమను తాము వేరుపరచుకున్నవారికి 18వ వచనంలో ఒక వాగ్దానం ఉన్నది. "మీరు నాకు కుమారులును, కుమార్తెలునై యుందురు". క్రీస్తు ప్రభువునందలి విశ్వాస మూలంగా మనం దేవుని కుటుంబంలో జన్మించాము, కానీ ఆయనను పోలి నడచుకున్నప్పుడే ఆ సంబంధాన్ని బలపరచుకోగలము. మన కాలంలో ఇలా జరగడంలేదు గానీ, బైబిల్ కాలంలో కుమారులు తమ తండ్రి నడచిన మార్గాన్ని అనుసరించేవారు. కుమారులు తమ తండ్రి పేరును పెట్టుకొనేవారు. తమ తండ్రి వృత్తినే చేపట్టేవారు. బైబిల్ కాలంలో కుమారునిగా ఉండడం అంటే, తండ్రిలాగా ఉండడం అని అర్థం. ఈ దృష్టాంతాన్నే పౌలు 2 కొరింథీ 6:18లో ఉపయోగించాడు. ఈ లోక మాలిన్యము నుండి మనం ఎంత వేరుగా జీవిస్తామో, మనం మన పరలోక తండ్రికి అంత దగ్గరగా ఉంటాము.

1 యోహాను 3:9లో ఇలా ఉన్నది. దేవుని మూలంగా పుట్టిన ప్రతివానిలో ఆయన బీజము నిలుచును గనుక వాడు పాపము చేయడు". (ఈ లోక సంబంధమైన తల్లిదండ్రుల బీజము మనలో నిలిచినట్లుగా). మన తండ్రి నుండి, తల్లి నుండి మనకు సంక్రమించే 23+23 క్రోమోజోములు వారి స్వభావాలు మరియు వ్యక్తిత్వాలను మన డియన్ఏలో రాసి ఉంచుతాయి. మనం ఎదిగే కొద్దీ తల్లిదండ్రులను అనుకరించడంలో ఈ విషయం అర్థమవుతుంది. ఇక్కడ దేవుని పిల్లలంగా మనం దేవునినే అనుకరించడానికి పిలువబడ్డాము. ఎందుకంటే ఆయన మన తండ్రి కాబట్టి.

### 3. దేవుని ఆజ్ఞ (7:1):

"ప్రియులారా మనకు ఈ వాగ్దానములు ఉన్నవి గనుక దేవుని భయముతో పరిశుద్ధతను సంపూర్తి చేసుకొంటూ శరీరమునకును ఆత్మకును కలిగిన సమస్త కల్మషమునుండి మనలను పవిత్రులనుగా చేసికొందుము".

ఏంటి ఆ వాగ్దానాలు? దేవుని సన్నిధి, ఆయన మనకు తండ్రిగా ఉంటాడు అనే విషయాలే. "మనలను పవిత్రులనుగా చేసుకొందుము". ఇదే ఆ ఆజ్ఞ. ఈ వాక్యాన్ని గ్రీకు భాషలో చదివినప్పుడు ఇది ఒక ప్రోత్సాహకరమైన ఆజ్ఞే కానీ అధికారపూర్వకమైన ఆజ్ఞ కాదని మనకు అర్థమౌతుంది. ఈ ఆజ్ఞ వాక్యాన్ని బోధించే వారికి కూడా వర్తిస్తుంది. మన శరీరాలను, ఆత్మలను కల్మషం చేసే ప్రతి దాని నుండి మనల్ని మనం వేరు చేసుకోవాలని ఈ వాక్యం మనల్ని ఆజ్ఞాపిస్తుంది. మన దృక్పథాలు, మన పనులు మనల్ని కల్మషం చేస్తాయి. మన కోరికలు, మన అలవాట్లు మనల్ని కల్మషం చేస్తాయి. పదాలు, పనులు మనల్ని కల్మషం చేస్తాయి. మనం కల్మషం అయినప్పుడు దేవుని పితృత్వాన్ని తృణీకరిస్తాము. దేవుని సన్నిధి మనలోనే ఉందన్న విషయాన్ని మర్చిపోతాము. మనల్ని మనం ఎలా పవిత్రులనుగా చేసుకోగలము? సమాధానం ఇక్కడే ఉన్నది. "పరిశుద్ధతను సంపూర్తి చేసుకొనుచు..." సంపూర్తి చేసుకొనుచు అనే పదము, పరిశుద్ధపరచుకోవడం అనేది మనం జీవించినంతకాలము చేయవలసిన పని అని తెలియజేస్తుంది. మనల్ని మనం పవిత్రులుగా చేసుకొనే క్రమంలో పరిశుద్ధతను సంపూర్తి చేసుకోవడానికి మనం నిరంతము ప్రయాసపడాలి. పరిశుద్ధతను సంపూర్తి చేసుకొనే కార్యము మనం క్రీస్తు ప్రభువును ముఖాముఖిగా చూచినప్పుడు ముగుస్తుంది. పరిశుద్ధతను సంపూర్తి చేసుకోవడానికి నేను ఎంతకాలము కృషిచేయాలి? ఈ లోకములో మనం జీవించినంతకాలము. కాబట్టి, పరిశుద్ధతను సంపూర్తి చేసుకోవడం అనేది రాత్రికి రాత్రి జరిగే

**పరిశుద్ధతంటే చీకటి మార్గంలో విజయవంతంగా ప్రయాణించడం కాదు. దేవుని వెలుగులో మనల్ని మనం పరీక్షించుకోవడం.**

పనికాదు. ఇది ఒక జీవితకాల ప్రక్రియ. పరిశుద్ధత అంటే పరిపూర్ణత సాధించడం అని అర్థంకాదు. పరిశుద్ధాత్మ దేవుని సహాయంతో పరిపూర్ణత కోసం ప్రయాసపడడం. అలా చేయమని దేవుడు మనల్ని ఆజ్ఞాపించాడు. ఇది సాధ్యమేనా? అవును, "మనలో దేవుని భయము" ఉంటే ఇది సాధ్యమే. నేను మారలేను, నేను ఇలానే జీవిస్తాను అని ఎవరైనా అంటే, వారు నిజానికి "నేను దేవునికి భయపడను" అంటున్నట్లు.

### 4. దేవుని ఉగ్రత (1 థెస్స 4:3-8)

"ప్రభువు వీటన్నిటి విషయమై ప్రతిదండన చేయువాడు". హెచ్చరించడం ప్రసంగీకుని బాధ్యత. అపవిత్రంగా జీవించే ప్రతి వ్యక్తి మీదకు, అతను విశ్వాసి ఐనా సరే, దేవుని ఉగ్రత వస్తుంది. మనల్ని మనం కల్మషం చేసుకున్నప్పుడు, మన పరలోకపు తండ్రికి అవమానం కలుగజేసినవాళ్ళమవుతాము. తన నామాన్ని తన పిల్లలు అగౌరవపరుస్తుంటే ఆయన చూస్తూ ఉండడు. ఆయన వారిని క్రమశిక్షణకు గురిచేస్తాడు. దేవుని క్రమశిక్షణ బాధాకరంగా ఉంటుంది. హెబ్రీ 12:29లో రాయబడింది అవిశ్వాసుల కోసం కాదు, విశ్వాసులకోసం, అది సార్వత్రిక వర్తమానం కోసం కాదు, సంఘ వర్తమానం కోసం. జీవము గల దేవుని చేతిలో పడడం బహు భయంకరంగా ఉంటుంది. మెల్లనైన దేవుని స్వరాన్ని, దేవుని హెచ్చరికను విని, "ప్రభువా, ఇది నాతప్పే, మరొకరిది కాదు. పశ్చాత్తాపం చెందడానికి, నా పాపాన్ని ఒప్పుకోవడానికి, మీ మాటలకు లోబడడానికి, నా నడతను మార్చుకోవడానికి నేను సిద్ధంగా ఉన్నాను" అని వినమ్రంగా దేవుని ఎదుట ఒప్పుకోవడానికి ఇష్టపడినవారు ధన్యులు.

నీవు పరిశుద్ధంగా జీవించాలనుకుంటున్నావా? ప్రతి విధమైన కల్మషానికి దూరంగా జీవించాల నుకుంటున్నావా? దేవునితో ప్రారంభించు. పరి శుద్ధత అనేది నేనొక్కడినే సంపాదించుకొనేది కాదు. నేను దేవుని సహాయంతో సంపాదించుకొనేది. నీవు అనేక సార్లు ప్రయత్నించావు, అయితే కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల విఫలమైయ్యావు. దేవుని సహాయం లేకపోతే, దేవుని ఆజ్ఞలను నెరవేర్చడానికి చేసే మానవ ప్రయత్నాలన్నీ విఫలమవుతాయి. నాలోని క్రీస్తు స్వరూపానికి నిదర్శనమే పరిశుద్ధత. ఆయన ఓర్పు, ఆయన ప్రేమ, ఆయన మంచితనం, ఆయన సాత్వికము మనలో ప్రతిబింబిస్తుంది. కాబట్టి, పవిత్రంగా జీవించేందుకు మనకు మొట్టమొదట అవసరమయ్యేది ఆయనే.

పరిశుద్ధతంటే చీకటి మార్గంలో విజయవంతంగా ప్రయాణించడం కాదు. దేవుని వెలుగులో మనల్ని మనం పరీక్షించుకోవడం. 1 యోహాను 1:5లో ఇలా ఉన్నది. "దేవుడు వెలుగైయున్నాడు. ఆయనయందు చీకటి ఎంత మాత్రమును లేదు". నీవు ఎల్లప్పుడూ నీ భర్త లేదా భార్య నీ తల్లిదండ్రులు లేదా నీ అన్నదమ్ములు, అక్క చెల్లెళ్ళు లేదా ఇతరుల వెలు గులో నిన్నునీవు పరీక్షించుకొంటున్నావు. లేదా నీవు ఏదో ఒక సాకు చెబుతున్నావు. నిన్ను నీవు సమర్థించుకొంటున్నావు. అందుకే నీ స్థితి ఇలానే ఉన్నది. నీవు వారికన్నా మంచిగా ఉన్నావని, చీకటి సందర్భాలలో విజయవంతంగానే ముందుకు వెళ్తున్నావని నీకు నీవు సర్దిచెప్పుకుంటున్నావు. నిజానికి నీ పరిస్థితి దిగజారిపోతుంది. దేవుని సత్యమైన వెలుగులోనికి నీవు వస్తే ఎంతగా చెడిపోయావో నీకు అర్థమవుతుంది. ఇతరుల నుండి వస్తుందని భావించిన చెడువాసన నీ నుండే వస్తుందని నీవు గుర్తిస్తావు. నీవు ఆత్మీయంగా పూర్వస్థితికి రావడానికి సరైన విధానం ఇదే. నీవు దేవుని వెలు గువద్దకు వచ్చేంత వరకు నీకు ఎలాంటి నిరీక్షణ కనిపించదు. తప్పిపోయిన కుమారుడు తన తండ్రి ఇంటికి తిరిగి రావాలంటే, ముందుగా తన స్థితికి కారణం పందులు కాదని, తానే పందుల దొడ్డిలో ఉన్నానని గ్రహించాలి. తన స్థితికి అతను ఎవర్నీ నిందించకూడదు. ఇక్కడ సంతోషకరమైన విషయం ఏంటంటే నీవు లేచి, నీ పరలోకపు తండ్రి వద్దకు వస్తే, ఆయన నిన్ను అంగీకరిస్తాడు, నిన్ను మారుస్తాడు, తన విందుకు నిన్ను తోడ్కొని వెళ్తాడు.

**– పాస్టర్. సిమియోన్ సుందర్**
బేతనీ బాప్టిస్ట్ చర్చ్, బెంగళూరు
**అనువాదం:** పి. రామస్వామి, దర్శి



# సిలువ వేయబడిన
# హృదయాన్ని నాకివ్వు ప్రభూ

సిలువ వేయబడిన హృదయాన్ని నాకివ్వు ప్రభూ
నీతో కూడ మరణించిన హృదయాన్ని నాకివ్వు
దేవునిలో జీవిస్తున్న జీవితాన్ని నాకివ్వు ప్రభూ
నీ రక్తంతో పవిత్రపరచబడిన జీవితాన్ని నాకివ్వు

స్వార్థం చచ్చిన హృదయాన్ని నాకివ్వు ప్రభూ
ఈ లోకానికి చచ్చిన హృదయాన్ని నాకివ్వు
అహానికీ ఆశలకూ చచ్చిన హృదయాన్ని నాకివ్వు
స్వయం స్వచిత్తం చచ్చిన హృదయాన్ని నాకివ్వు

నా పాత స్వభావాన్ని నీ సిలువలో వ్రేలాడదియ్యి
నేనీలోకాన్ని పెంటలా ఎంచుకొనేలా చెయ్యి
లోకాశలన్నీ చచ్చిపోయేంతగా నన్ను పవిత్రపరచు
లోకానికి చచ్చినంతగా నన్ను పరిశుద్ధపరచు

సిలువ వేయబడిన వినయ మనస్సును నాకివ్వు
సున్నితమైన కరుణగలిగిన మనస్సును నాకివ్వు
సిలువ వేయబడిన స్వచ్ఛమైన మనస్సును నాకివ్వు
నీ ప్రతి పిలుపుకు ప్రతిస్పందించే మనస్సును నాకివ్వు

నా ఆశలు ఆశయాలు సిలువ వేయబడును గాక
నా ప్రేమ పరిపూర్ణతా స్థాయికి చేరుకొనును గాక
నన్ను నా సమస్తాన్ని సిలువకు మేకులతో కొట్టు
నన్ను పూర్తిగా నీ కొరకై సిలువలో సరిదిద్దు

ప్రభూ, నీ మరణం నిరంతరం నాలో ఉండనివ్వు
నా స్వయాన్ని పూర్తిగా సిలువ మేకులకు బంధించు
ప్రతి క్షణం సిలువ వేయబడిన అనుభవం నాకివ్వు
నా స్వరూపాన్ని పూర్తిగా నీ సారూప్యంలోకి మార్చు

**– వెస్లీ డ్యూయల్**

*(మెజర్ యువర్ లైఫ్ పుస్తకం నుంచి)*

కథానిక



# నిజ ప్రేమ

"ఒరేయ్... ప్రేమ్! ఇంకా ఎంతసేపు పడుకుంటావు? కాలేజీకెళ్లవా? అర్థరాత్రిదాకా రోడ్లు సర్వే చేయడమెందుకు? ఆలస్యంగా రావడమెందుకు? పెందలకడే ఇంటికొచ్చి కడుపునిండా తిని కంటినిండా నిద్రపోవచ్చుగా" అంది పరిమళ కొడుకును నిద్రలేపుతూ. దుప్పటి పక్కకి తొలగించి బద్ధకంగా లేచి పెద్దగా ఆవలిస్తూ "అర్థరాత్రిదాకా ఎక్కడ తిరిగానమ్మా! ఏదో ప్రెండ్స్ బయటికెళ్దామంటే వెళ్ళాను. అంతేగా" అన్నాడు ప్రేమ్ మంచం దిగుతూ.

"ఏం ఫ్రెండ్సో ఏంటో... బైబిల్‌స్టడీకి వెళ్ళమంటే వెళ్ళనంటావు. ఒకవేళ వెళ్ళినా ఇష్టం లేనట్లు కూర్చుంటావు. నువ్వు కడుపులో ఉన్నప్పుడు నేను దేవుని గురించి తెలుసుకున్నాను. వాక్యం ద్వారా క్రీస్తు ప్రేమను రుచిచూశాను. దేవుని వాక్యంమీద విశ్వాసముంచి ఆయనను సొంత రక్షకునిగా అంగీకరించాను. నీతోపాటు క్రీస్తు మీద నా విశ్వాసంతో పాటు ప్రేమ పెరుగుతూ వచ్చాయి. కానీ నువ్వు మాత్రం దేవుడంటే భయమూ, భక్తీ లేకుండా ఉన్నావు. ఏమైపోతావో ఏంటోనని దిగులుగా ఉంది" అంది బాధగా...

"నువ్వున్నావు కదమ్మా.. నాకేమవుతుంది?" అన్నాడు తల్లిని సమీపిస్తూ ప్రేమ్.

"పిల్లలతో తల్లిదండ్రులు ఎన్నాళ్ళుంటార్రా. పిల్లల్ని సరైన దారిలో నడిపించే వరకు, దేవుని ప్రేమను రుచి చూపించే వరకు, మీకు వివాహమయ్యేంత వరకేగాని.. ఎల్లకాలం ఉంటారా? మీరు మంచిమార్గంలో నడిస్తే, మంచి స్థితిలో ఉంటే సంతోషిస్తాం. దేవుని వాక్యాన్ని ఆధారంగా చేసుకుని ఒక్కో మెట్టూ ఎక్కుతుంటే పొంగిపోతుంటాం. అయినా ఇంటర్మీడియట్ చదివే వయసులో ఏది మంచో ఏది చెడో ఏం తెలుస్తుంది. గాలి ఎటు వీస్తే అటు వెళ్తారు. మీ ఇష్టం వచ్చిన దారి మీరు ఎంచుకుని మా కళ్లముందే పాడైపోతుంటే మాకు ఎంత బాధగా ఉంటుందో తెలుసా? పైగా నేను హాస్టల్‌కి వెళ్ళి అక్కడున్న వాళ్లకి దేవుని ప్రేమ గురించి చెప్పి వస్తున్నాను. ఇంట్లో నువ్వు మాత్రం దేవునికి దూరంగా ఉంటూ ఇలా అవుతున్నావు..." ఏదో జీర గొంతుకి అడ్డంపడి మాట్లాడలేకపోయింది పరిమళ.

## అమ్మంటే ఇష్టం... దేవుడంటే ఇష్టం... లోకమంటే ఇష్టం...
## ఎవరిని కాదనాలో?

ఆ మాటలకు చలించిపోయిన ప్రేమ్ తల్లి దగ్గరగా వెళ్ళి "ఇప్పుడేమయిందమ్మా... అంత బాధపడుతున్నావు? నీ మాట ఎప్పుడైనా కాదన్నానా?" అన్నాడు.

"నువ్వు మంచివాడివి కాదని చెప్పడం నా ఉద్దేశ్యం కాదురా. కాకపోతే ఆ మంచితనానికి దేవుని భయమూ తోడైతే నీ జీవితం ఇంకెంత బాగుంటుందో కదా అనేదే నా ఆలోచనంతా! 'యౌవ్వనకాలమున యెహోవా కాడిమోయుట నరునికి మేలు' అని బైబిల్ చెప్తుంది. యౌవ్వనకాలమంతా స్నేహితులనీ, షికార్లనీ వృథా చేస్తే ఇక దేవుడి గురించి ఎప్పుడు తెలుసుకుంటావు? మనల్ని ప్రేమించడానికి పరలోకాన్ని, ప్రాణాన్ని ఎంతగా త్యాగం చేశాడో ఎప్పుడు గ్రహిస్తావు. కనుక సమయం మించకముందే దేవుని తెలుసుకొంటే నీ జీవితం బాగుంటుంది. అలా కాకుండా నువ్వేమో వాయిదాలేస్తున్నావు. జీవితం ఎప్పుడెలా ఉంటుందో ఎవరు చెప్పగలరు? నీకోసం మనవాళ్లంతా ప్రార్థన చేస్తున్నారు. వాళ్ల ప్రార్థనలు ఫలించైనా నువ్వు దేవుని ప్రేమను గుర్తెరిగితే అదే సంతోషం.. దేవునికి మహిమ" అంటూ బయటికి వెళ్ళింది. వెళ్తున్న తల్లివంక చూస్తూ దీర్ఘంగా నిట్టూర్చాడు ప్రేమ్.

వారంలో అన్ని రోజులూ ఏదో ఒక కార్యక్రమం జరుగుతూనే ఉంటుంది. కాలేజ్‌లో తప్ప స్నేహితుల్ని కలవడం కుదరడం లేదు. కొత్త కొత్త స్నేహాలు, కొత్త వాతావరణం... అన్నీ తన దేహాన్ని ఆశల సాగరంలో ముంచిలేపుతూ లోకంలో ఇంకా కొత్తదనమేదో మిగిలుందనే భ్రమను కలిగిస్తున్నాయి. వాటిని వదిలి రావాలంటే ఏదో పోగొట్టుకున్నట్లుగా, కోల్పోయినట్లుగా అనిపిస్తుంది. అమ్మంటే ఇష్టం... దేవుడంటే ఇష్టం... లోకమంటే ఇష్టం... ఎవరిని కాదనాలో? ఆలోచనలతో మిగతా పనులను పూర్తిచేశాడు.

❄❄❄

గేటుదాటి కాలేజ్ ఆవరణంలోకి ప్రవేశించాడు ప్రేమ్. చుట్టూనాటిన మొక్కలు పలకరిస్తున్నట్లుగా తలలూపు తున్నాయి. చల్లటిగాలి శరీరానికి తగులుతుంటే హాయిగా ఉంది. ఎక్కడ ఖాళీగా ఉంటే అక్కడ కూర్చుని ఫ్రెండ్స్‌తో కబుర్లాడుతున్నారు అందరూ. తను రోజూ కలిసే స్నేహితులకోసం చుట్టూ చూశాడు ప్రేమ్. క్యాంటీన్ పక్కనున్న సిమెంట్ బెంచీ మీద ఇద్దరు స్నేహితులు కూర్చుని కనిపించారు. 'హాయ్' అని విష్ చేస్తూ వారిని సమీపించాడు. కూర్చున్న ఇద్దరిలోనూ కదలిక లేదు. ముఖంలో ఏదో ఆందోళన కనిపించింది. ఇంతకుముందెప్పుడూ ప్రేమ్ వాళ్ల ముఖాల్లో అలాంటి భావాలను గమనించలేదు. తనకోసం వెదుకుతూ, తను కనిపిస్తే ప్రాణం లేచివచ్చినట్లుగా తనను సమీపించేవాళ్లు. 'ఎలా ఉన్నావంటూ కుశలప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసేవాళ్లు. వాళ్లనలా చూస్తే ప్రేమ్ మనసు ఆనందంతో పొంగిపోయేది. తనకోసం ఏమైనా చేయడానికి, అవసరమైతే ప్రాణం ఇవ్వడానికైనా సిద్ధం అన్నట్లుగా ఉన్న స్నేహితుల్ని చూసి తనలో తానే ఎంతో గర్వపడేవాడు. అసలు తన బలం, బలహీనత కూడా స్నేహితులేగా! కానీ ఇప్పుడు చూసినా చూడనట్లుగా వ్యవహరించడంలోని ఆంతర్యం అర్థంకాలేదు. వాళ్ల పక్కన కూర్చుని "ఏరా... రాజూ! ఏమయిందిరా? అలా ఉన్నారు" అడిగాడు ప్రేమ్.

కాసేపటి మౌనం తర్వాత "నువ్వు రోజీతో మాట్లాడడం ఆ కిరణ్ గాడు చూశాడంట. వాడు రోజీకి ప్రపోజ్ చేశాడులే. మీ ఇద్దరూ మాట్లాడుకొంటుంటే మీ ఇద్దరి మధ్యా ఏదో ఉందని నిన్ను కొట్టడానికి ప్లాన్ చేశాడట. వాడి స్నేహితుల్లో ఒకడు నాకు కూడా ఫ్రెండ్‌లే! వాడే ఈ విషయం చెప్పి నిన్ను జాగ్రత్తగా ఉండమని చెప్పాడు.." అన్నాడు.

ప్రేమ్‌లో ఉక్రోషం మొదలైంది. కోపంతో కళ్లు ఎరుపెక్కాయి. "వాడలా మాట్లాడుతున్నప్పుడే తన్నకపోయావా? అయినా వాడు నన్ను కొడతానని చెప్పినప్పుడు వింటూ తలూపుకుంటూ వచ్చి ఆ విషయం నాకు చెప్పకపోతే అక్కడే వాళ్ల సంగతి చూసేయాల్సింది" అన్నాడు కోపంగా. మళ్ళీ కాసేపటి తర్వాత తనే "అయినా మీరు నాతో ఉండగా నన్ను కొట్టే ధైర్యం ఎవరికుంటుంది?" అన్నాడు ఇద్దరి వంకా చూస్తూ. స్నేహితులిద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. కాసేపటి తర్వాత 'మమ్మల్నేమి చేయమంటావు? అన్నారు."నామీదకొస్తే చూస్తూ ఊరుకుంటారా?" అన్నాడు ప్రేమ్.

"ఊరుకోకుండా వాళ్లతో దెబ్బలాడి పోలీసుకేసులతో భవిష్యత్తు నాశనం చేసుకోమంటావా? ఆ కిరణ్‌గాడు అన్నిటికీ తెగించినవాడు. ఏదైనా చేస్తాడు లేకపోతే చేయిస్తాడు" అన్నారు.

"అంటే దానర్థం గొడవలు పడమని కాదురా. నాకు కష్టం వస్తే మీకు వచ్చినట్లే కదా! నాతో ఉంటారు కాబట్టి ఇలాంటివి వచ్చినప్పుడు నాకు సహాయం చేయాలిగా" అన్నాడు ఏదో అర్థమయి కానట్లుగా.

"నీకో దండంరా బాబూ.. ఏదో కలిశాము, స్నేహితులమయ్యాం. అంతే తప్ప గొడవలు, కేసులు అంటే మాత్రం మా వల్లకాదు. మా ఇళ్ళల్లో తెలిస్తే ఇక అంతే సంగతులు. అలాంటి పరిస్థితులొస్తే నీతో స్నేహమైనా మానేస్తాం..." అన్నాడు రాజు.

ఇద్దరూ లేచివెళ్ళిపోయారు. ఒక్కసారిగా కాళ్లకింద భూమి కదిలినట్లయింది. పోలీసులు, గొడవలు, కేసులంటూ వాళ్ళు చెప్పిన దాన్లో నిజమున్నప్పటికీ స్నేహితుడిగా ఆపదొస్తే మావల్ల కాదంటూ చేతులెత్తేయడం ప్రేమ్‌కి చాలా అవమానంగా, బాధగా అనిపించింది. నిరాశ నిలువునా ఆవరించింది. మనిషి ఎప్పుడెలా మారతాడో తెలియదు. మనసు ఎప్పుడూ ఒకేలా ఉండదు. అవసరాన్ని బట్టి, పరిస్థితుల్ని బట్టి మారుతుంటుంది. స్నేహితుల్లో నిజమైన స్నేహితుల్ని, వ్యక్తుల్లో నిజమైన ప్రేమనీ గుర్తించమనీ పెద్దవాళ్ళు అందుకే చెప్తారేమో!

❋❋❋

ఒక్కసారిగా అమ్మ గుర్తుకొచ్చింది. అమ్మ పదేపదే చెప్పే దేవుని ప్రేమ గుర్తొచ్చింది. దేవునికి మనమేమిచ్చామని తరతరాల నుంచి మనల్ని ప్రేమిస్తూనే ఉన్నాడు? మన మాటల్లోనూ, ప్రవర్తనతోనూ ఎన్నిసార్లు గాయపరచినా క్షమించి మళ్లీ మనల్ని తన ప్రేమలోకి నడిపిస్తున్నాడు? ప్రేమంటే అవసరాలు ఉన్నంత వరకే చూపించి అవి తీరిపోగానే ఏమీ తెలియనట్లు మర్చిపోవడమా? ఎదుటివాడు కష్టంలో ఉన్నప్పుడు ముఖం చాటేయడమా? రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడకపోవడమా? అనే ఆలోచనలు ప్రేమ్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

'తన స్నేహితుల కొరకు తన ప్రాణము పెట్టువానికంటె ఎక్కువైన ప్రేమగలవాడెవడు?' అన్న వాక్యంలోని అంతరార్థాన్ని ఇన్నాళ్ళూ తనెందుకు గుర్తించలేకపోయాడు. లోకంలోని ప్రేమలు అవసరాల్ని ఆశ్రయించి ఉంటాయి. కానీ దేవుని ప్రేమ అనాదికాల సంకల్పం చొప్పున ఏర్పడింది. ఆ ప్రేమలో స్వార్థముండదు, అసూయ ఉండదు, ద్వేషముండదు. అన్నిటినీ మించి ఇవ్వడమే తప్ప తీసుకోవడం తెలియదు. అవదులు లేని ప్రేమ దేవునిలో ఉంది కాబట్టే మనకు బదులుగా తన ప్రాణాన్ని తృణప్రాయంగా అప్పగించుకున్నాడు.

వాక్యం మనసులో మెదులుతున్నకొద్దీ హృదయం భారంగా మారిపోసాగింది. అమ్మ చెప్పింది నిజమే... స్నేహితుల, తల్లిదండ్రుల ప్రేమలు కొంతకాలం వరకూ మనతో ఉంటాయి. మనం ఇష్టపడిన వాళ్ల ప్రేమలు కాలక్రమంలో కనుమరుగవుతాయి. మనల్ని ఇష్టపడిన వాళ్ల ప్రేమలు పరిస్థితుల్ని బట్టి ప్రలోభాలకు లోనవుతుంటాయి. కానీ లోకాన్ని ఎంతో ప్రేమించిన దేవుడు, ప్రేమకు ప్రతిరూపంగా అవతరించిన దేవుడు, నిజస్నేహితుడిగా నిజమైన ప్రేమను చూపించిన దేవుని ప్రేమ మాత్రం ఎప్పటికీ నిలిచే ఉంటుంది. కళ్ళు కన్నీళ్ళతో, హృదయం దేవునిపట్ల కృతజ్ఞతతో నిండిపోయింది. ఒక స్థిరమైన నిశ్చయతతో ఇంటివైపు నడిచాడు.

❋❋❋

"అమ్మా... నేను కూడా బైబిలుస్టడీకి వెళ్తాను. సుధీరన్నకు చెప్పు" అంటున్న ప్రేమ్ వంక ఆశ్చర్యంగా చూసింది పరిమళ. "ఎందుకమ్మా... అంత ఆశ్చర్యం!" అన్నాడు నవ్వుతూ. "ఆశ్చర్యం కాక మరేముంది? వెళ్ళమని ఎంత బతిమాలినా వెళ్ళని వాడివి ఇప్పుడు నీయంతట నీవే వెళ్తానంటుంటే నమ్మశక్యం కావట్లేదు" అంది పరిమళ.

"ఇన్నాళ్ళూ బైబిల్‌స్టడీకి వెళ్ళాలని ఉన్నా స్నేహితులంటూ తప్పించుకొనితిరిగాను. కానీ స్నేహితుల దగ్గర మోసపోయాను. నాకోసం ప్రాణమిచ్చే స్నేహితులున్నారని పొంగిపోయాను. కానీ నాకొక ఆపదొచ్చేసరికి వాళ్ల ప్రేమలో ఎంత నిజం, నిజాయితీ ఉందో గ్రహించాను. అందుకే ఏ స్వార్థం లేకుండా, మన లోపాలను భరించి, మన పాపాలను క్షమించే దేవునిలో తప్ప ఎవరిలోనూ నిజమైన ప్రేమ లేదని గుర్తించాను. అందుకే ఈ రోజునుంచీ లోకాన్ని విడిచిపెట్టి దేవునిని వెంబడించాలనుకుంటున్నాను. నా స్నేహితులకు కూడా నిజమైన దేవుని ప్రేమను తెలియజెప్పాలని అనుకుంటున్నాను" అన్నాడు సంతోషంగా.

పరిమళ మనసు ఆనందంతో నిండి పోయింది.

– **డా. జడా సుబ్బారావు**, నూజివీడు

## కోశాధికారి లేఖ

# కోశాధికారి బాధ్యతలు

క్రీస్తునందు అతి ప్రియమైన యుఇయస్ఐ-ఏపి కుటుంబ సభ్యులకు, కోశాధికారులకు, ప్రార్థనా సహకారులకు మన ప్రభువైన యేసుక్రీస్తు నామంలో శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ప్రతి ఇయు, ఇజియఫ్‌లోని కోశాధికారులు తమ బాధ్యతలు తెలుసుకొని, వాటిని నిర్వర్తించాలని కోరుచున్నాను.

**గత సంచిక తర్వాత...**

### 5. ఇయు డబ్బును ఎలా ఉపయోగించాలి?

ఇయు డబ్బును తనకు నచ్చిన విధంగా ఖర్చు చేసే స్వేచ్ఛ కోశాధికారికి లేదు. కమిటీ నిర్ణయం ప్రకారమే అన్ని ఖర్చులు జరగాలి. కమిటీ నిర్ణయం ప్రకారం జరిగే ప్రతి ఖర్చు వివరాలను కార్యదర్శి మినిట్స్ పుస్తకంలో అధికారికంగా నమోదు చేయాలి. ఇయు ధనాగారం నుండి తన స్వంత ఖర్చుల కోసం అప్పు తీసుకోవడం వంటి పనులు కోశాధికారి ఎన్నడూ చేయకూడదు.

కొన్నిసార్లు కొంతమంది బయటి వ్యక్తులు లేదా వేరే సంస్థలు కమిటీని సంప్రదించి, తుఫాను బాధితుల కోసమో, అనాథల కోసమో, లేదా మరింకేదో మంచి పనికోసం విరాళం ఇవ్వమని కోరే అవకాశమూ లేకపోలేదు. ఇయు సభ్యులు వ్యక్తిగతంగా అలాంటి విషయాలకు స్పందించే పూర్తి స్వేచ్ఛ వారికి ఉన్నది. అయితే, రాజ్యాంగములోని ఆర్టికల్ 2లో ఉన్న యుఇయస్ఐ లక్ష్యాలకు సంబంధములేని ఎలాంటి కార్యక్రమము కోసం కూడా ఇయు డబ్బును ఖర్చు చేయకూడదు అన్న విషయాన్ని కమిటీ గుర్తుంచుకోవాలి. అంటే దీని అర్థం, ఇయు డబ్బును ఈ క్రింది విషయాలకు మాత్రమే ఖర్చు చేయాలి:

ఎ. విద్యార్థుల సౌవార్తీకరణ

బి. ఇయు సభ్యులు క్రైస్తవ సహవాసంలో ఎదుగుటకు నిర్వహించే కార్యక్రమాలు

సి. కళాశాల లేదా విశ్వవిద్యాలయాలలో క్రీస్తు సాక్ష్యాన్ని లేవనెత్తడానికి ఏర్పాటు చేసే కార్యక్రమాలు.

డి. భారతదేశంలో మరియు ఇతర దేశాలలో సువార్త ప్రకటన.

ఇంతకుముందు తెలియజేసిన ఆర్టికల్స్, అంటే లక్ష్యాలకు సంబంధించిన ఆర్టికల్ 2, ఆర్థిక విధానానికి సంబంధించిన ఆర్టికల్ 11తో పాటు రాజ్యాంగములోని మరో మూడు ఆర్టికల్స్‌ను కోశాధికారి జాగ్రత్తగా పాటించాలి. అవి ఏంటంటే, అఫిలియేషన్‌కు సంబంధించిన ఆర్టికల్ 5, ఇతర సంస్థలకు సహకారం అందించడానికి సంబంధించిన ఆర్టికల్ 8, అంతర శాఖోద్యమానికి (Interdenominational) సంబంధించిన ఆర్టికల్ 10.

**స్తుతించండి**

1. మన స్టాఫ్‌కు 100% శాలరీ, అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభువు చూపిన కృపను బట్టి

**ప్రార్థించండి**

1. యుఇయస్ఐ-ఏపి ఏసియం-2021 తర్వాత పెరిగిన 18% బడ్జెట్‌కు అనుగుణంగా 30 ఇజియఫ్‌లు కాంట్రిబ్యూషన్స్ పెంచి పంపిస్తున్నాయి. వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. మిగిలిన ఇజియఫ్‌లు కూడా ప్రార్థించి సహకరించవలసిందిగా కోరుచున్నాము.
2. యుఇయస్ఐ నేషనల్‌కు ప్రతి నెల ఆఫీసునుంచి పంపే కాంట్రిబ్యూషన్స్ 75,000/- నుంచి 80,000/- రూ. పెంచడానికి స్టేట్ యాన్యువల్ కౌన్సిల్‌లో నిర్ణయించారు. పెరిగిన 5,000/- కొరకు
3. ప్రేయర్ హట్ పూర్తిచేయడానికి 1.40 లక్షలు, స్టెరెట్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కోసం 8 లక్షలు, చాందపిళ్ళ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కొరకు 5 లక్షలు అవసరం
4. యాన్యువల్ ఇంక్రిమెంట్, నూతన కో-ఆర్డినేటర్స్ నియామకాల వలన అవసరమైన అదనపు ధనం 60 వేల కోసం
5. స్టాఫ్‌కు ఐదు ల్యాప్‌టాప్‌లు సబ్సిడీలో ఇవ్వడానికి అవసరమైన 1,20,000/- కొరకు

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు

**యస్. ఆర్. డి. కిషోర్ కుమార్**

**AP MONTHLY REQUIREMENT – Rs. 11,10,000/- (18% Hike W.R.T present income)**

**DECEMBER 2021**

| Receipts | | Payments | |
|---|---|---|---|
| Opening Balance | 819.00 | Field Staff Salaries | 4,51,416.00 |
| General Fund | 9,14,877.00 | Field Staff HRA, CA, MA & TA | 2,12,924.00 |
| Staff Support | 56,618.00 | Office Staff Salaries | 1,66,244.00 |
| Rajasthan | 10,000.00 | UESI | 80,000.00 |
| | | Rajasthan | 30,000.00 |
| | | Jammu & Kashmir | 15,000.00 |
| | | Office Expenditure | 18,040.00 |
| | | Closing Balance | 8,690.00 |
| **Total** | **9,82,314.00** | | **9,82,314.00** |

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-01-2022**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508




# కొలబద్ధ

మొదటి శతాబ్దపు రోజుల్లో ఒక యూదుడు 'రబ్బీకి' లేదా 'బోధకునికి' శిష్యుడుగా తయారు కావాలంటే తన కుటుంబాన్ని, వృత్తిని వదిలి పెట్టి 'రబ్బీ'తో పాటుగా జీవించడానికి సిద్ధపడాలి. 24 గం॥ వాళ్ళు కలిసి ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి ప్రయాణిస్తూ, బోధిస్తూ, నేర్చుకొంటూ, పఠిస్తూ, పనిచేస్తూ జీవించేవాళ్ళు. కలిసి లేఖన భాగాల ను చర్చించడం, కంఠత పెట్టి జీవన శైలికి అన్వయించుకొనేవారు.

శిష్యుడు రబ్బీతో ఎంతో సన్నిహితంగా సమయాన్ని గడుపుతూ, రబ్బీ నోటి నుంచి వెలువడే ప్రతి పదాన్ని అతి జాగ్రత్తగా గ్రహించేవాడు. ఈ అతి సన్నిహితబంధంలో కొంత కాలానికి శిష్యుడు తన రబ్బీవలే తయారయ్యేవాడు. "మనమందరమునూ ముసుకు లేని ముఖములో ప్రభువు యొక్క మహిమను అద్దంవలే ప్రతి ఫలింపచేయుచూ మహిమ నుండి అధిక మహిమను పొందుచూ, ప్రభువగు ఆ ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము" (2 కొరింథీ 3:18). పౌలు చెప్పిన ఈ మాటలు ఒక శిష్యుని జీవితానికి ప్రభువు కలిగివున్న ఒక లక్ష్యం.

రబ్బీ, శిష్యుడు కలిగి ఉండే అతి సన్నిహితబంధం కలిగి ఉండటానికి అవసరమైన ఆధ్యాత్మిక క్రమశిక్షణలు (మౌనధ్యాన సమయం, వ్యక్తిగత వాక్య పఠన, ఆరాధన) గురించిన అవగాహన, అవసరమైన వనరులు, సాహిత్యం, టీచింగ్ ప్రోగ్రామ్స్ అందుబాటులోనే ఉంటాయి. సమస్య ఏంటంటే ఇవి చాలా సార్లు బాహ్యంగా నిర్వర్తించే చేతల్లాగానే మిగిలిపోతున్నాయా? లేక అంతర్గత మార్పును, ఆధ్యాత్మిక ఎదుగుదలలోనికి మనలను పురికొల్పుతున్నాయా? బిజీ లైఫ్, ఒత్తిడి, పరిచర్య ప్రాధాన్యతలలో ప్రణాళికలేమి కారణంగా ప్రశాంతంగా మన 'రబ్బీ' యైన క్రీస్తు సన్నిధిలో గడిపి, మన ఆధ్యాత్మిక జీవితంలోని ఎదుగుదలను గుర్తించగలుగుతున్నామా?

అందుకే మనం కొంత విరామ సమయం తీసుకొని వ్యక్తిగతంగా మన సంపూర్ణ ఎదుగుదలను కొలుచుకుంటూ ఉండాలి. యేసుక్రీస్తు వారి వ్యక్తిత్వంలోని సంపూర్ణ ఎదుగుదలే మన కొలబద్ద (లూకా 2:52) ఆయన ఎలా ఎదిగాడంటే...

**జ్ఞానం:** మేధస్సు పరంగా – మన మనస్సులో విశాల దృక్పథాలు ఎంత వరకు ఏర్పడుతున్నాయి?

**వయస్సు:** శరీర పరంగా – నా శరీర విషయంలో జాగ్రత్తలు తీసుకొంటున్నానా?

**దేవుని దయ:** ఆధ్యాత్మిక జీవితం – ప్రభువు ఇప్పటికే బయలు పరచిన వాటి విషయంలో విధేయత చూపుతున్నానా?

**మానవుల దయ:** సామాజిక సంబంధాలు – నా ఎదుగుదలకు స్ఫూర్తినిచ్చే విధంగా నా స్నేహాలు ఉన్నాయా?

మన ప్రభువుతో మనం కలిగివుండే 'కనెక్షన్' మన జీవితానికి సంబంధించిన అన్ని విషయాలలో 'ట్రాన్స్‌ఫార్మేషన్' తెస్తుంది. కాబట్టి మన రబ్బీ అడుగు జాడలో నడవడానికి తీర్మానించుకొందాం.

**– బి.జె. లాజరస్,** హైదరాబాద్